


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 103, పేజీలు - 08

సోమవారం, జులై 12, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




## సీనియర్ నేతలంతా
# ఎవరికి వారే యమునా తీరే

### తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన సీట్లు, ఓట్లతో దూసుకెళ్లిపోవాల్సిన తెలంగాణ బీజేపీ పూర్తి స్థాయిలో సైలెంట్ అయిపోయింది. దీనికి కారణం ఏమిటో ఆ పార్టీ క్యాడర్‌కు మెల్లగా అర్థమవుతోంది. పార్టీ ముఖ్య నేతల మధ్య ఆధిపత్య పోరాటం వల్లనే ఎవరికి వారు పట్టించుకోవడం మానేయడంతో సమస్యలు వస్తున్నట్లుగా గుర్తించారు. మరి పార్టీ హైకమాండ్ ఈ సమస్యను ఎందుకు గుర్తించడం లేదో మాత్రం వారికి అర్థం కావడం లేదు.

**కిషన్ రెడ్డి సమావేశానికి ఎమ్మెల్యేలు డుమ్మా**

తెలంగాణ బీజేపీలో ఎవరి దారి వారిదే అన్నట్లుగా సీనియర్ నేతలు వ్యవహరిస్తున్నారు. ఇటీవల పార్టీ చీఫ్ కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కీలక సమావేశానికి ఏడుగురు ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. ఆ పార్టీకి ఉన్న ఒక్క ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి సైతం హాజరుకాలేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలకు అత్యంత కీలకమైన ఈ సమావేశానికి వారు హాజరాకపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఒక్క నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి కూడా హాజరు కాలేదు. కిషన్ రెడ్డితో సమావేశానికి ఎమ్మెల్యేలు గైర్హాజర్ కావడానికి చాలా కారణాలు ఉన్నాయని చెబుతున్నారు. తెలంగాణ బీజేపీ చీఫ్ గా కూడా ఉన్న కిషన్ రెడ్డి ఎమ్మెల్యేలను అసలు పరిగణనలోకి తీసుకోవడం లేదని అందుకే ఆయన నాయకత్వంలో పని చేయడం కన్నా కొత్త నాయకుడు వచ్చే వరకూ సైలెంట్ గా ఉండటం బెటరని అనుకుంటున్నారు.

**ఎమ్మెల్యేల మధ్యా కనిపించని సఖ్యత**

పార్టీ నుంచి గెలిచిన 8 మంది ఎమ్మెల్యేల మధ్య కూడా సమన్వయ లోపం కనిపిస్తోంది. రాజాసింగ్ పార్టీ లీడర్లతో అంటిముట్టనట్లుగా ఉంటున్నారు. బీజేఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డికి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఒక్కరే మద్దతుగా ఉంటున్నారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారని ఇతర ఎమ్మెల్యేలను కలుపుకొని పోవడం లేదని మిగిలిన ఎమ్మెల్యేలు ఫీలవుతున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు దిశానిర్దేశం చేసేందుకు ఎమ్మెల్యేలను ఆహ్వానించగా కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. మాజీ సీఎం, ప్రస్తుత సీఎంలను కామారెడ్డిలో ఓడించిన కేవీఆర్ తాను ఎందుకు గెలిచానా అని మథన పడుతున్నారు. అసెంబ్లీలో బీజేపీ వాయిస్ పెద్దగా వినిపించలేదు. తెలంగాణకు కేంద్రం కేటాయించిన ప్రాజెక్టులు, నిధుల విషయమై పార్టీ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేకపోతే సభలో ఏం మాట్లాడాలని ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. దీనికి కారణం పార్టీలోని పరిస్థితులేనని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**పార్టీపై దృష్టి పెట్టలేకపోతున్న కిషన్ రెడ్డి**

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇప్పటికీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన ఎక్కువగా 6లో ▶

## హిండెన్‌బర్గ్ ఆరోపణలపై
# రాహుల్ గాంధీ స్పందన
### - బీజేపీ కౌంటర్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అదానీ గ్రూప్‌కు సంబంధించి హిండెన్‌బర్గ్ తాజా నివేదిక (హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్)పై మరోసారి దుమారం రేపింది. ఈసారి సెబీ చైర్‌పర్సన్ మాధబి పూరీ బుచ్, ఆమె భర్త ధవల్ బుచ్ పాత్రపై ప్రశ్నలు తలెత్తెలా చేసింది. మరోవైపు కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై మరోసారి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఇన్వెస్టర్లు కష్టపడి సంపాదించిన సొమ్ముకు ప్రయోజనం లేకుంటే దానికి బాధ్యులెవరు అని రాహుల్ ప్రశ్నించారు. హిండెన్‌బర్గ్ తాజా నివేదికను అనుసరించి, బుచ్ దంపతులు మొదట ఆరోపణలను తిరస్కరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇది కాకుండా, హిండెన్‌బర్గ్ ఆరోపణలు అన్యాయమని సెబి ఒక ప్రకటన విడుదల చేసింది. అదే సమయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా, కొత్త హిండెన్‌బర్గ్ నివేదికను ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో కేంద్రం ప్రవర్తన పక్షపాతంతో ఉందని అన్నారు. దీనిపై విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా కేంద్రంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సెబీ ఛైర్ పర్సన్ పై ఆరోపణలతో సెబీ పవిత్రత దెబ్బతిందని విమర్శించారు. 'భారత్-ఆస్ట్రేలియా మధ్య ఇలాంటి అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరుగుతుందని ఊహించుకోండి, అంపైర్ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నారు. ఫలితం ఎలా ఉంటుంది, మ్యాచ్ చూస్తున్న ప్రతి ఒక్కరూ ఎలా భావిస్తారు. 6లో ▶

## అమరరాజా ఇక్కడి నుంచి
# వెళ్లిపోతుందటగా : కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** అమరరాజా సంస్థ తెలంగాణ రాష్ట్రాన్ని వీడతామంటూ ప్రకటించటం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టవద్దన్నారు. బ్రాండ్ తెలంగాణ ఇమేజ్‌కు నష్టం రాకుండా రేవంత్ రెడ్డి చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే రాష్ట్రం నుంచి వెళ్లిపోతామని అమరరాజా సంస్థ చెబుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, అదే నిజమైతే చాలా దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైఖరేంటో అర్థంకాక చాలా సంస్థలు రాష్ట్రాన్ని వీడుతున్నాయన్న కేటీఆర్ కేన్స్ టెక్నాలజీ అనే సంస్థ తెలంగాణ నుంచి గుజరాత్‌కు వెళ్లిపోయిందన్నారు. కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించిందన్నారు. ఇప్పుడు అమరరాజా కూడా వెళ్లిపోతానని చెబుతుంటే, ఇది తెలంగాణ బ్రాండ్‌కు తీవ్ర నష్టం చేస్తుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం ఎంతమాత్రం మంచిది కాదని కేటీఆర్ హితవు పలికారు. 6లో ▶

## హైదరాబాద్‌లో
# మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణ



**కాలిఫోర్నియా(ప్రశ్న న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. పలు ప్రముఖ సంస్థలు, కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణకు మోనార్క్ ట్రాక్టర్ సంస్థ ముందుకు వచ్చింది. దీంతో మరిన్ని ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోని తమ పరిశోధన-అభివృద్ధి సంస్థను విస్తరించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో కూడిన తెలంగాణ ప్రతినిధి బృందంతో మోనార్క్ సంస్థ ప్రతినిధులు చర్చించారు. తెలంగాణకు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మోనార్క్ ట్రాక్టర్ సంస్థ ప్రతినిధులు కలిశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో తమ ఆర్ అండ్ డీ సంస్థకు అనుబంధంగా స్వయంప్రతిపత్తి ట్రాక్టర్ టెస్టింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

హైటెక్, పర్యావరణ అనుకూల కంపెనీలను ఆకర్షించడంపై తాము దృష్టిసారించామని, మోనార్క్ ట్రాక్టర్స్‌ను తెలంగాణకు ఆహ్వానిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్వయంప్రతిపత్తి ,ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో తెలంగాణను అగ్రగామిగా నిలిచేలా, ఆ విజన్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ 6లో ▶

# చంద్రబాబు ఒకటే పథకం
### - 7 ప్రయోజనాలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సారథ్యంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఇటీవలే తొలిసారిగా కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహించింది. భవిష్యత్తులో తాను అవలంబించబోతున్న విధానాలు, సంక్షేమం కోసం అమలు చేయాలనుకుంటున్న పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. వాటిని ప్రజలకు చేరువయ్యేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని, ఈ విషయంలో అలసత్వానికి తావులేదని స్పష్టం చేశారు. ఒకటే పథకంద్వారా ప్రజలకు ఎన్నిరకాలుగా ప్రయోజనాలు కలుగుతున్నాయో తెలుసుకుందాం.

**ప్రతి నెలా ఒకటో తేదీన పేదల సేవలో**

సెప్టెంబరు ఒకటోతేదీ నుంచి పేదల 6లో ▶

## బీజేపీకి ఆంధ్రా తీపి,
# తెలంగాణ చేదు అయిందా.?



- తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీలు తీరని అన్యాయం చేశాయని విమర్శ
- ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న మాజీ మంత్రి
- రెండు పిల్లర్లు కూలితే కాళేశ్వరమే కూలినట్లు ప్రచారం చేశారని మండిపాటు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీజేపీకి ఆంధ్రా తీపి అయితే తెలంగాణ చేదు అయిందా? అని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీలు తీరని అన్యాయం చేశాయని విమర్శించారు. 6లో ▶

## ఓఆర్ఆర్
# ఆర్ఆర్ఆర్ మధ్య రోడ్లు
### - 12 చోట్ల రేడియల్ రహదారులు - అక్కడ భూముల ధరలకు రెక్కలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణకు సూపర్ గేమ్ ఛేంజర్‌గా రీజినల్ రింగు రోడ్డు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు సుమారు 40 కి.మీ దూరం నుంచి ఈ రహదారిని నిర్మిస్తున్నారు. అయితే హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, ఆర్ఆర్ఆర్ మధ్య 2,300 నుంచి 2,400 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి రేవంత్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ రహదారులను అనుసంధానం చేసేందుకు రహదారి ప్రణాళిక అవసరమని ప్రభుత్వం సూచించింది. దీంతో రహదారులు, భవనాల శాఖ ఇప్పటికే కసరత్తు మ్మొదలు పెట్టింది. ప్రస్తుతం ఔటర్ రింగు రోడ్డుకు, ఆర్ఆర్ఆర్ మధ్య సుమారు 70 వేల ఎకరాల వరకు భూమి ఉంటుందని రేవంత్ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ భూమిని వివిధ క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు వీలుగా అంతర్గతంగా రోడ్లను నిర్మించాల్సి ఉంది. ఆ ప్రాంతంలో రహదారులు, భవనాల శాఖ స్టేట్ రోడ్స్ విభాగానికి సుమారు 2 వేల కిలోమీటర్లు, జాతీయ రహదారులు 4 వందల కిలోమీటర్ల వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై ప్రస్తుతం కసరత్తు చేస్తున్నారు.

ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌కు అనుసంధానంగా మ్మొత్తం 12 ప్రాంతాల్లో రేడియల్ రోడ్లు డెవలప్ చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. అయితే ఆ రహదారులు ఎటు నుంచి ఎటు నిర్మించాలి ? ఎంత వెడల్పు ఉండాలి ? నిర్మాణ వ్యయం అవుతుంది ? తదితర అంశాలపై ప్రస్తుతం అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే రెండు నెలల్లో ఆ కసరత్తు కొలిక్కి వస్తుందని అధికారులు చెబుతున్నారు. కాగా, ఈ రహదారులు నిర్మించే ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు 6లో ▶

## కొట్టుకుపోయిన
# తుంగభద్ర డ్యామ్ గేటు
### - లక్ష క్యూసెక్కుల నీరు వృథా



**అమరావతి (ప్రశ్న న్యూస్)** కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్ గేటు విరిగి కొట్టుకుపోయింది. శనివారం రాత్రి 11 గంటలకు హొస్పేట వద్ద తుంగభద్ర డ్యామ్‌లో వరద తగ్గడంతో గేట్లను మూసివేస్తున్న క్రమంలో 19వ గేటు చైన్ లింక్ తెగి కొట్టుకుపోయింది. దీంతో డ్యామ్ నుంచి నీరు ఏకధాటిగా దిగువకు ప్రవహిస్తూనే ఉంది. ఇప్పటివరకు లక్ష క్యూసెక్కులకుపైగా నీరు వృథాగా కిందికి పోయిందని అధికారులు పేర్కొన్నారు. 6లో ▶

## సీతారామ ప్రాజెక్టు
# పంపుల ట్రయల్ రన్
### - ఏటా 10 లక్షల ఎకరాలకు నీరు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్విచ్ ఆన్ చేసి సీతారామ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్ ప్రారంభించారు. సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్-2ను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. భద్రాద్రి సీతారామ ప్రాజెక్టుతో ఏటా 10 లక్షల 6లో ▶

## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ-ఎస్టి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా విద్యాసాగర్ కాందారి

### దళిత బిడ్డకు దక్కిన అరుదైన గౌరవం



హైద్రాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రతినిత్యం సమాజ శ్రేయస్సుకు నడుం బిగించి ప్రజలతో మమేకమై దళిత బిడ్డల అభివృద్ధి కోసం పాటుపడుతున్న విద్యా సాగర్ కాందారికి దక్కిన అరుదైన గౌరవం. విద్యాసాగర్ కాందారిని ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రావులపల్లి తిరుపతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ దళిత జాతి గౌరవం, అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం వ్యవస్థాపక అధ్యక్షులకు, తోడ్పాటుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదములు తెలిపారు.

## 40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



భద్రాద్రి బ్యూరో (ప్రశ్న న్యూస్) అదో అపూర్వ కలయిక. నాలుగు దశాబ్దాల తర్వాత వారంతా కలుసుకుని, పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఇల్లందు పట్టణం కళాసి బస్తీలోని బియుపిఎస్ పాఠశాలలో 1984-85 బ్యాచ్ కు చెందిన సెవెంత్ క్లాస్ స్టూడెంట్స్ ఆదివారం కలుసుకున్నారు. స్కూల్ దగ్గర ఫోటోలు దిగారు. కోట మైసమ్మ అమ్మవారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. తమతో పాటు చదివి మృతి చెందిన తోటి స్టూడెంట్స్ తో పాటు తమకు చదువు చెప్పి మృతి చెందిన గురువులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు గల తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. భవిష్యత్తులో తమ బ్యాచ్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పోతు రాజేందర్, రాజశేఖర్, సంజీవరెడ్డి, భాస శ్రీనివాస్, గందె సదానందం, యాకూబ్ పాషా, సిలివేరి పూర్ణచంద్రరావు, శివ, సుదర్శన్, వ్యమసాని కిరణ్, రాజేష్ లాహౌటి పాల్గొన్నారు.

## యువ రైతులను అభినందించిన కోరుట్ల ఎమ్మెల్యే



జగిత్యాల్(ప్రశ్న న్యూస్) మెట్ పల్లి మండలం రామారావుపల్లె గ్రామానికి చెందిన విల్లసాగరపు గంగాధర్, ఇంద్రాల రత్నాకర్ అనే యువ రైతులు తమ యొక్క కేజీ విల్ ట్రాక్టర్ ని రోడ్ పాడవుతుందనే ఉద్దేశ్యం తో మరో ట్రాక్టర్ సహాయంతో ఆ యొక్క కేజీ వీల్ ట్రాక్టర్ ని రోడ్డు దాటించడం చూసిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ వారి వద్దకు వచ్చి అభినందించారు రోడ్ పాడవుతుందని సామాజిక బాధ్యతతో వాళ్లు ఇలా రోడ్ దాటించడం చూసి ఆనందం వ్యక్తం చేశారు.ప్రభుత్వ ధనం వృధా కాకుండా కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని,వీరిని చూస్తే చాలా సంతోషంగా ఉందని తెలిపారు.ఈ మధ్యలో ఏ రోడ్డు చూసిన కేజీవీళ్లతో పాడైపోతున్నాయని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేసారు.గత 10 సంవత్సరాలలో బీఆర్ఏస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో సుమారు 500 కోట్లతో అన్ని రోడ్లను అద్భుతంగా తీర్చిదిద్దుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని రోడ్డు పాడవకుండా వారి యొక్క కేజీ వీల్ ట్రాక్టర్స్ ని ఇలా రోడ్డు దాటియాలని ఎమ్మెల్యే కోరారు.

## వాహన చోరీలకు పాల్పడుతున్న దొంగలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



జగిత్యాల(ప్రశ్న న్యూస్) కోరుట్లపట్టణ శివారులోని కావేరి గార్డెన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా బైక్ వెళ్తుండగా వారిని ఆపి తనిఖీ చెయ్యగా గతంలో ద్విచక్ర వాహనాలు జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందినఎం ఎహర్షద్ తండ్రి నజీర్28 సంవత్సరంలు, ముస్లిం వృత్తి కూలి పని చేసుకుంటున్నా డు డబ్బు పై అధిక ఆశతో చూడ వృత్తిని ఎన్నుకుని చోరీలకు పాల్పుతున్న పాల్పడుతున్నారు పోలీసులకు అందిన సమాచారం మేరకు పనికి నిర్వహించారు వారి నుండిస్వాధీన పరుచుకున్న రెండు ద్విచక్ర వాహనాలు 27000 నగదు ఎస్పీ అశోక్ కుమార్ డీఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఆదేశానుసారం శనివారం రాత్రి 7 గంటల సమయంలోసీఐ సురేష్ బాబు కిరణ్ కుమార్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కోరుట్ల నగదు రెండు ద్విచక్ర నామ స్వాధీనం చేసుకున్నారు ఆగస్ట్ 7:30 అర్ధరాత్రి తండ్రి అలా స్టేట్ బ్యాంక్ మార్కెట్ రోడ్ సంగంలో సమీపంలో కిరాణా షాప్ లో చోరీకి పాల్పడింది వీరేనని అలాగే మెట్పల్లిలో ఒక షాపులో ఒక షాపులో చోరీకి పాల్పడ్డారని డిఎస్పి మహేశ్వర్ రెడ్డి తెలిపారు లో నిందితుడు ఎం ఎం హర్షద్ గతములో చేసిన వివిధ నేరాలు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ లో 1 2 జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ లో 4, 3 మెటుపల్లి పోలీస్ స్టేషన్ లో 1 బైక్ లు మరియు రాత్రిపూట చోరీలకు మహేందర్ బాలుడు కు పాల్పడే ఒక వ్యక్తి మరియు అల్లుడు మైనర్ బాలుడు నీ వెంట పెట్టుకుని రాత్రిపూట కోరుట్ల లో తిరుగుతూ చోరీలకు పాల్పడేవారిని డిఎస్పి వివరించారు కుర్అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు సహకరించిన సిబ్బందికిఎస్సై కిరణ్ కుమార్ సిబ్బంది విజయ్ ఎల్లయ్య సత్తయ్య సాగర్ శ్రీనివాస్ లను ఎస్పీ,డి.ఎస్పీ అభినందించారు

## రైల్వే స్టేషన్ లో అగ్ని ప్రమాదం సుమారు ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం



జగిత్యాల(ప్రశ్న న్యూస్) జగిత్యాల పట్టణ శివారు ప్రాంతం లింగంపేటలోని రైల్వే స్టేషన్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మహారాష్ట్ర నుంచి కర్ణాటకకు బొగ్గు తరలిస్తుండగా లింగంపేట్ స్టేషన్ లో ఒక్కసారిగా గూడ్స్ రైలు బోగీలో మంటలు వచ్చాయి.ఇది గమనించిన రైల్వే సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే ఒక వ్యాగన్ లోని బొగ్గు పూర్తిగా కాలిపోయిందని.. సుమారు ఐదు లక్షల నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. కాగా ప్రమాద సమాచారం అందుకున్న రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటక కి వెళ్తున్న ఈ గూడ్స్ రైల్లో మొత్తం 3500 టన్నుల బొగ్గు తరలిస్తున్నట్లు తెలుస్తుంది.

## ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే



జగిత్యాల(ప్రశ్న న్యూస్) జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కి చెందిన పావని కంటి ఆసుపత్రి ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జగిత్యాల నియోజకవర్గ, పరిసర ప్రాంతాలకు చెందిన నిరుపేదల 17 మందికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. ఉచిత కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవ దేహంలో ప్రతి అవసరానికి ముఖ్యమైన కంటి చూపుని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని తెలిపారు.

## పంద్రాగస్టు వేడుకల పనులు త్వరగా పూర్తి చేయాలి



జగిత్యాల(ప్రశ్న న్యూస్) స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జరుపుకునే వేడుకల ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ పి రాంబాబు పరిశీలించారు.పట్టణంలోనీ పరేడ్ గ్రౌండ్లలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రెవెన్యూ సిబ్బందితో కలిసి ఏర్పాటను పరిశీలించారు. అనంతరం త్వరగా తగినన్ని పనులు చేయాలని అధికారులకు ఆదేశించారు.

## గడప గడపకు హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం




జగిత్యాల(ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ జగిత్యాల్ నియోజకవర్గం కార్యాలయం కమల నిలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ బోగ శ్రావణి మాట్లాడుతూ,జాతి ఐక్యత సమగ్రత పట్ల నిబద్ధతతో గత కొన్ని సంవత్సరాలుగా దేశ ప్రజలందరితో పాటు పార్టీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాల ద్వారా హర్ ఘర్ తిరంగా తిరంగా యాత్రను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు తిరంగ యాత్రలు, బైక్ ర్యాలీలు, సామూహిక జాతీయ గీతాలాపన, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలి.చిన్న ఇల్లు పెద్ద ఇల్లు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై ఆత్మగౌరవంతో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి త్రివర్ణ పతాకం గొప్పతనాన్ని ఇనుమడింప చేయడానికి హర్ ఘర్ తిరంగ అభియాన్ అనేది ప్రత్యేక వేడుకగా మారింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మండల మరియు బూత్ స్థాయిలో సమ్మేళనాలు సదస్సులు నిర్వహించి దేశ విభజన చీకటి అధ్యయనాన్ని స్మరించుకుంటూ స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు స్మారక చిహ్నాలకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించాలి.ఈ కార్యక్రమంలో,పట్టణ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవనం నుండి జిల్లా పోలీస్ సేవలు



జగిత్యాల(ప్రశ్న న్యూస్)జిల్లా పోలీస్ శాఖ కోసం జిల్లా కేంద్రంలో కొత్త భవనం నిర్మించిన విషయం జిల్లా ప్రజలకు విధాతమే. ఇకనుంచి నూతన పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడం జరుగుతుందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

## బీసీ కాలనీలో ఘనంగా ముగిసిన విగ్రహా ప్రతిష్టాపన ఉత్సవాలు

### - కార్యక్రమంలో పాల్గొన్న యువజన నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి



**పటాన్ చెరు (ప్రశ్నన్యూస్)** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో రేణుకా ఎల్లమ్మ ఆలయం,పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున మున్సిపల్ కౌన్సిలర్ గోపాలమ్మ వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన కౌన్సిలర్ గోపాలమ్మ వెంకటయ్యను ఆలయ నిర్వాహకులు,కాలనీ వాసులు అభినందించి గోపాలమ్మను,యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ భక్తిని కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఉత్సవ కమిటీ నిర్వాహకులు విశ్వనాథ్, శ్రీను,స్వామి,శేఖర్, బీరప్ప,భాను,శ్రీనివాస్,వెంకటేష్ ,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తలసేమియా బాధిత చిన్నారుల సహాయార్థం రక్తదాన శిబిరం

### - రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఉమ్మడి మెదక్ జిల్లా హెచ్ఆర్సీ అధ్యక్షుడు మెట్టు శ్రీధర్



**పటాన్ చెరు (ప్రశ్న న్యూస్)** కండర క్షీణత వ్యాధి భాధిత సంఘం,యువచైతన్య ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం తలసేమియ వ్యాధి భాధిత చిన్నారుల సహాయార్థం తలసేమియా సికిల్ సెల్ సొసైటి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఉమ్మడి మెదక్ జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ టిఎండిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపటి రవికుమార్ ను సన్మానించారు.ఈ సంధర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధి భాధిత చిన్నారులకు పదిహేను రోజులకు ఒకసారి రక్తాన్ని మార్పిడి చేయాలని ప్రాణాపాయస్థితిలో ఉండే రోగులకు అత్యవసరపరిస్థితుల్లో రక్తదాతలు ప్రాణదాతలుగా మారుతున్నారని ఇటువంటి రక్తదాన శిబిరాలను మరిన్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.మడపటి రవికుమార్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకుని గత నాలుగు సంవత్సరాలుగా ఈ రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లను అందించారు.ఈ కార్యక్రమంలో బాపు,వెంకన్న,వెంకోబా,మహేష్,జ్యోతి శ్రీనివాస్,అన్వర్ సాబ్,వేణుగోపాల్,అరవింద్,సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి జ్ఞాపకార్థం బహూకరించిన వాటర్ ట్యాంక్



పోలవరం (ప్రశ్న న్యూస్ )ఈరోజు కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో గత సంవత్సరం యాక్సిడెంట్లో చనిపోయినటువంటి జనసేన వీర మహిళ బల్లె లక్ష్మీ సంవత్సరీకానికి నేడు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కరాటం సాయి మండల అధ్యక్షులు తోట రవి కోయిలగూడెం టౌన్ అధ్యక్షులు మాదేపల్లి శ్రీను ఏపూరి సతీష్ పాల్గొనడం జరిగింది బల్లె రమణ భర్త జనసేన పార్టీ తరఫున లక్ష్మీ జ్ఞాపకార్థం కోసం బహుకరించిన వాటర్ ట్యాంక్ ను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళ పాల్గొన్నారు

## నిరుద్యోగులను నిండా ముంచారు..
# పెట్టుబడులు పోకుండా చూడాలి
**- ఎమ్మెల్యే కేపీ వివేకానంద**




కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలన్నీ అటకెక్కించిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగులను నిండా ముంచారని ఆరోపించారు. నిరుద్యోగులు పోరాడుతున్నా బీజేపీనాయకులు మద్దతు ఇవ్వరని.. బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో 25 లక్షల మంది ఉపాధి అవకాశాలు కల్పించినం. బీఆర్ఎస్ హయాంలో ఐటీ సెక్టార్‌లో 6లక్షల ఉద్యోగాలు వచ్చాయి. కాంగ్రెస్ పాలనలో అన్నీ దిగజారుతున్నాయి. అమరరాజా కంపెనీ తెలంగాణ నుంచి తరలిపోతామని చెప్తోందని.. ఉన్న పెట్టుబడులు పోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలని సూచించారు. బీజేపీ నాయకులు భావ దారిద్ర్యంతో ఉన్నారు. భూములులాక్కుంటున్నారని కొడంగల్ రైతులు ఆందోళన చేస్తున్నారు. కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి.. రేవంత్‌కు సహాయ మంత్రిగా మారిపోయారని, రేవంత్ రెడ్డికి కోవర్టుగా పనిచేస్తున్నారని విమర్శించారు. అమెరికాలో సోదరుడి కంపెనీతో రేవంత్ అగ్రిమెంట్ చేసుకున్నరు. కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి ఆ ఒప్పందాన్ని సమర్థించారు. ఆ ఒప్పందం ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ కిందికి వస్తుంది. సుంకిశాల ప్రమాదం చిన్నది అన్నట్టుగా చూపిస్తున్నరు.. కాంట్రాక్ట్ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. 2వ తేదీన సుంకిశాల ప్రమాదం జరిగింది. సోషల్ మీడియాలో వస్తే కానీ ప్రభుత్వానికి తెలియలేదు. ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో దీన్ని బట్టే అర్థమవుతోందని ఎమ్మెల్యే వివేకానంద పేర్కొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వెల మాధురికి రోడ్డు ప్రమాదం.. ఆస్పత్రికి తరలింపు



అమరావతి : ఏపీ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనుతో వివాహేతర సంబంధం ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ నాయకురాలు దివ్వెల మాధురి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆదివారం ఆమె ప్రయాణిస్తున్న కారు ఆగిఉన్న మరో కారును ఢీకొట్టడంతో ఆమెకు గాయాలయ్యాయి. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ వద్ద జరిగిన ఘటన జరిగింది. గాయపడ్డ మాధురిని పలాస ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆస్పత్రిలో మాట్లాడుతూ 'నేను డిప్రెషన్‌లో ఉన్న .. చనిపోయేందుకే బయటకి వచ్చానని' పేర్కొన్నారు. గత రెండురోజులుగా ఏపీలో హాట్‌టాపిక్‌గా మారిన ఎమ్మెల్సీ వ్యవహారంలో దువ్వాడ శ్రీను భార్య శ్రీవాణి మాధురిపై తీవ్ర ఆరోపణలు చేసింది. తన భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందని ఆరోపిస్తూ శ్రీను ఇంటిపై కూతుళ్లతో కలిసి దాడి చేసింది. దివ్వెల మాధురి అనే మహిళతో సంబంధం పెట్టుకుని తమను వదిలేశారని దువ్వాడ శ్రీనివాస్ కుమార్తెలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో తనపై వస్తున్న ఆరోపణలపై దివ్వెల మాధురి కూడా స్పందించారు. దువ్వాడ శ్రీనివాస్‌ను తాను ట్రాప్ చేయలేదని స్పష్టం చేశారు. తననే దువ్వాడ శ్రీనివాస్ సతీమణి వాణి రాజకీయంగా తనను ట్రాప్ చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్యే టికెట్ పొందడం కోసం తనను పావుగా వాడుకుందని తెలిపారు. వాణినే తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చారని. ఇప్పుడు తానెవరో తెలియదని అంటుందని విమర్శించారు. దువ్వాడ శ్రీనివాస్‌కు, వాణికి మధ్య ఏవైనా విబేధాలు ఉంటే వారే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. స్వార్థంతో వాణి తనపై నిందలు వేశారని.. తన వైవాహిక జీవితాన్ని కూడా దెబ్బతీసిందని మాధురి ఆరోపించారు. ఆ బాధతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నప్పుడు దువ్వాడ శ్రీను తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఓ ఫ్రెండ్‌లా, కేర్‌టేకర్‌లా తనతో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం తామిద్దరం కలిసే ఉంటున్నామని స్పష్టం చేశారు. అయితే తమది సహజీవనం కాదని.. అడల్ట్ రిలేషన్ అని పేర్కొన్నారు.

# రిజర్వేషన్, రాజ్యాంగం, కుల నిర్మూలనకు ఆరెస్సెస్ వ్యతిరేకం
**- మాణిక్యం ఠాగూర్**




కుల వ్యవస్థ సోపాన క్రమం కొనసాగాలని ఆరెస్సెస్ కోరుకుంటుందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ అన్నారు. అగ్ర కులాల వారు ముందువరసలో ఓబీసీలు, ఎస్సీలు దిగువ స్థాయిలో ఉండే వ్యవస్థను ఆరెస్సెస్ అనుసరిస్తుందని చెప్పారు. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఇదే తీరులో మాట్లాడారని పేర్కొన్నారు. కుల వ్యవస్థ కొనసాగాలన్నదే కాషాయ పాలకుల విధానమని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియతో కుల వ్యవస్థను పెకిలించివేయాలని ఆకాంక్షించే క్రమంలోనే తాము కుల గణనను కోరుతున్నామని చెప్పారు. అప్పుడే నిజమైన వివక్షను పరిష్కరించడం సాధ్యమవుతుందని అన్నారు. రిజర్వేషన్, రాజ్యాంగం, కుల నిర్మూలనకు ఆరెస్సెస్ వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. కుల వ్యవస్థ వేళ్లూనుకునేందుకు రాజ్యాంగంలో మార్పులను ఆరెస్సెస్ కోరుకుంటున్నదని అన్నారు. భారత్ ఏకమత రాజ్యంగా ఉండాలని ఆరెస్సెస్ ఆకాంక్ష అని చెప్పారు. ఈ రకమైన ఆరెస్సెస్ ఆలోచనా ధోరణి మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్‌ల ఆశయాలకు విరుద్ధమని మాణిక్యం ఠాగూర్ వివరించారు. ఆరెస్సెస్ విధానాలను కాషాయ పాలకులు అనుసరిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## ఏపీ హెూం మంత్రి అనితకు తప్పిన పెను ప్రమాదం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ హెూంమంత్రి వంగలపూడి అనితకు పెను ప్రమాదం తృటిలో తప్పింది. మంత్రి అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం విజయవాడ నుంచి పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం అలంపురం సైనిక పాఠశాలలో విగ్రహం ఆవిష్కరణకు బయలు దేరారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం జాతీయరహదారి వాహనం వద్ద ఆమె కారు ప్రమాదానికి గురైంది. బైక్‌ను తప్పించే సమయంలో మంత్రి ఎస్కార్ట్ వాహన డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశారు. దీంతో ఆ వాహనాన్ని మంత్రి ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో మంత్రి కారు, ఎస్కార్ట్ వాహనం స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

## విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం..
# సీఈవో గది దగ్ధం



అమరావతి : విశాఖపట్నం లో వారం రోజుల వ్యవధిల్లో రెండు ఆస్పత్రుల్లో అగ్నిప్రమాద ఘటనలు జరుగడం పట్ల రోగులు కలవర పాటుకు గురవుతున్నారు. మెడికవర్ ఆస్పత్రిలో అగ్నిప్రమాద ఘటనను మరవకముందే ఆదివారం విశాఖ సెవెన్‌హిల్స్ ఆస్పత్రి ఐదో అంతస్తులో అగ్నిప్రమాదం జరిగింది. దట్టంగా పొగలు అంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో ఆస్పత్రి సీఈవో గది పూర్తిగా దగ్ధమయ్యింది. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమని అనుమానిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం అగ్నిప్రమాదం జరిగిన సెవెన్‌హిల్స్ ఆస్పత్రిని విశాఖ సీపీ శంకబ్రత బాగ్చీ స్పందించారు. ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేశారని తెలిపారు. రోగులకు ఎలాంటి ముప్పులేదని ఆస్పత్రి యాజమాన్యం తెలిపిందని వివరించారు. అన్ని ఆస్పత్రుల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని, రెండు వారాల్లో అన్ని ఆస్పత్రులు భద్రత ప్రమాణాలు పెంచుకోవాలి సూచించారు.

## లేడీస్ వాష్‌రూమ్ చెత్తడబ్బాలో మొబైల్.. ఫ్లైట్ మోడ్‌లో పెట్టి వీడియో రికార్డ్



బెంగళూరు : బెంగళూరులోని ఓ ప్రముఖ కాఫీ షాపులో పని చేస్తున్న ఓ ఉద్యోగి అత్యంత నీచమైన చర్యకు పాల్పడ్డాడు. లేడీస్ వాష్‌రూమ్‌లోని డస్ట్‌బిన్‌లో సెల్‌ఫోన్‌ను ఉంచాడు. ఆ మొబైల్‌ను ఫ్లైట్ మోడ్‌లో ఉంచి, కెమెరాను ఆన్ చేసి వీడియో రికార్డు చేశాడు. దీన్ని గమనించిన ఓ మహిళ.. కాఫీ షాపు యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. అయితే ఈ ఫోన్ కెమెరా దాదాపు రెండు గంటల పాటు రికార్డింగ్ మోడ్‌లో ఉన్నట్లు తేలింది. అయితే కెమెరాకు ఏమీ అడ్డురాకుండా సంచికి చిన్న రంధ్రం చేసి టాయిలెట్ సీట్ దిశగా ఉంచినట్లు బాధిత మహిళ తెలిపారు. ఈ వ్యవహారాన్ని గ్యాంగ్స్ ఆఫ్ సినీపుర్ పేరిట ఉన్న ఓ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్టు చేశారు. బీఈఎల్ రోడ్‌లోని థర్డ్ వేవ్ కాఫీ ఔట్‌లెట్‌లో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పేర్కొన్నారు. బెంగళూరులోని థర్డ్ వేవ్ కాఫీ ఔట్‌లెట్‌లో నేను ఉన్నాను. ఆ సమయంలోనే ఓ మహిళకు వాష్‌రూమ్‌లోని డస్ట్‌బిన్‌లో మొబైల్ కనిపించిందని ఆమె తెలిపింది. ఫోన్ కనిపించకుండా చాలా జాగ్రత్తగా అందులో దాచిపెట్టారు. దాదాపు 2 గంటల పాటు వీడియో రికార్డ్ అయింది. ఫ్లైట్ మోడ్‌లో పెట్టడం వల్ల అక్కడ మొబైల్ ఉన్నట్టు ఎవరికీ తెలియలేదు. కెమెరా మాత్రం కనిపించేలా డస్ట్ బిన్‌కి ఓ రంధ్రం పెట్టారు. కెమెరాను గుర్తించిన ఆ మహిళ కాఫీ షాపు యాజమాన్యానికి చెప్పింది. అక్కడ పని చేస్తున్న ఉద్యోగి ఈ పని చేసినట్టు తేలింది. పోలీసులు వెంటనే వచ్చి ఆ వ్యక్తిని విచారించారు. కఠిన చర్యలు తీసుకుంటామని కాఫీ షాపు యాజమాన్యం చెప్పినట్లు గ్యాంగ్స్ ఆఫ్ సినీపుర్ ఇన్‌స్టా ఖాతాలో పేర్కొన్నారు. ఈ ఘటనపై సదరు కాఫీ విక్రయ సంస్థ స్పందించింది. జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేసింది. తమ ఔట్‌లెట్లలో ఇలాంటి దుశ్చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేసింది. సదరు వ్యక్తిని వెంటనే ఉద్యోగంలో నుంచి తీసేసినట్లు పేర్కొంది. ఈ సంస్థకు దేశ వ్యాప్తంగా ఔట్‌లెట్లు ఉండడం గమనార్హం. ఈ దారుణానికి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

## హిండెన్‌బర్గ్ నివేదికపై జ్యోతిరాదిత్య సింధియా కీలక వ్యాఖ్యలు




అదానీ గ్రూప్‌పై ఏడాదిన్నర కిందట సంచలన ఆరోపణలు చేసిన మార్కెట్ రీసెర్చి కంపెనీ హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలు కలకం రేపుతున్నాయి. అదానీ గ్రూప్ అక్రమంగా నిధుల మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్, ఆమె భర్త ధవళ్ బుచ్‌కు వాటాలున్నాయని లేటెస్ట్ రిపోర్ట్‌లో పేర్కొనడం దుమారం రేపుతోంది. కాగా హిండెన్‌బర్గ్ నివేదికపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా భగ్గుమన్నారు. గ్వాలియర్‌లో కేంద్ర మంత్రి ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నదని, దేశంలో అరాచకం వ్యాప్తి చేయడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. వివాదాస్పద వ్యవహారాల్లో దేశం నలిగిపోవాలని మాత్రమే ఆ పార్టీ కోరుకుంటుందని మండిపడ్డారు. దేశాన్ని పురోగతి పథంలో, అభివృద్ధి మార్గాన నడిపించాలని ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ప్రతి బీజేపీ కార్యకర్తా కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం దేశ ప్రతిష్టను దిగజార్చి ప్రతి ఒక్కరినీ చీకట్లో మగ్గేలా చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరి తొలి నుంచీ ఇదేనని, విచ్ఛిన్నకర విధానాలతోనే ఆ పార్టీ ముందుకెళుతున్నదని జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు.

## గాజుల రామారంలో ఘోర రోడ్డు ప్రమాదం..
## సెక్యూరిటీగార్డును ఢీకొట్టిన కారు..




హైదరాబాద్ : గాజుల రామారం పరిధిలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ సెక్యూరిటీగార్డును అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆ సెక్యూరిటీ గార్డు గాల్లోకి ఎగిరిపడ్డాడు. కారు ముందు భాగం కూడా తీవ్రంగా ధ్వంసమైంది. కారు వేగంగా దూసుకురావడంతో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం కూడా విరిగిపోయింది. ఓ కంపౌండ్ వాల్ కూడా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడిని సెక్యూరిటీగార్డ్ గోపీ(38)గా పోలీసులు నిర్ధారించారు. అయితే కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

## కేఫ్ కాఫీ డే ఫౌండర్ వీజీ సిద్ధార్థ బలవన్మరణంపై డీకే శివకుమార్ మౌనం వీడాలి : కుమారస్వామి




కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకులు వీజీ సిద్ధార్థ ఆత్మహత్యకు సంబంధించి కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు అన్ని విషయాలూ తెలుసని కేంద్ర మంత్రి, కర్నాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. సిద్ధార్థ ఎందుకు బలవన్మరణానికి పాల్పడ్డారో డీకే శివకుమార్ వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. డీకే శివకుమార్‌కు దివంగత పారిశ్రామికవేత్తకు సంబంధించిన అన్ని వివరాలు తెలుసునని అన్నారు. సిద్ధార్థ ఆత్మహత్యకు దారితీసిన విషయాలన్నింటినీ బయటపెట్టాలని తాను ఆయనను కోరుతున్నానని చెప్పారు. కాగా కేంద్ర మంత్రి కుమారస్వామి ఆదివారం మాండ్యలో రైతులతో కలిసి నాట్లు వేశారు. రైతులతో కలిసి సాగు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇది తన కుటుంబ సభ్యుల కార్యక్రమమని అన్నారు. వారితో కలిసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం తనకు సంతృప్తి ఇస్తుందని అన్నారు. రైతులతో కలిసి ఇవాళ కొన్ని మొక్కలు నాటామని చెప్పారు. హెచ్‌డీ దేవెగౌడ రైతు కుటుంబం నుంచి వచ్చారని, వ్యవసాయం తమ రక్తంలోనే ఉందని తెలిపారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు బాగా పడ్డాయని, దీంతో రైతులంతా సంతోషంగా పొలాల్లో పనిచేసుకుంటున్నారని అన్నారు.

## ఏపీలోని దేవాలయాలకు గుడ్‌న్యూస్..
### దూపదీప నైవేద్యాలకు ఆర్థిక సాయం పెంపు : మంత్రి ఆనం



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న దేవాలయాలకు త్వరలో పాలకమండళ్లు ఏర్పాటు చేయనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు. దూపదీప నైవేద్యాల కోసం రూ. 5 వేలకు బదులు రూ. 10 వేల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు. దీని ద్వారా దేవదాయశాఖపై రూ. 32 కోట్ల అదనపు భారం పడుతుందని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్‌లో ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. సీజీఎఫ్ కింద 160 ఆలయాలు పునర్నిర్మిస్తామని అన్నారు. రాష్ట్రంలో 27, 127 ఆలయాల పరిధిలో 4.65 లక్షల ఎకరాలు ఉందని వివరించారు. ఆలయ భూములు పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తామని, కృష్ణా, గోదావరి సంగమం వద్ద జలహారతులు పునరుద్ధరిస్తామని అన్నారు. రూ. 50 వేల కంటే తక్కువ ఆదాయం ఉన్న ఆలయాలకు ఆర్థికసాయం పెంచుతామని స్పష్టం చేశారు. దూపదీప నైవేద్యాల కోసం రూ. 5 వేలకు బదులు రూ. 10 వేల ఆర్థికసాయం అందజేస్తామన్నారు. దీని ద్వారా దేవదాయశాఖపై రూ. 32 కోట్ల అదనపు భారం పడుతుందని వెల్లడించారు. తిరుమల నుంచే దేవదాయ శాఖలో ప్రక్షాళన మొదలైందని పేర్కొన్నారు. ఆలయాల్లో ఏ చిన్న ఆరోపణలు వచ్చినా నివేదికలు తెప్పించుకుంటున్నామని , అధికారుల పనితీరును మెరుగుపరుస్తున్నామని తెలిపారు. నెల్లూరు జిల్లాలో పనితీరు బాగులేని 5గురిపై చర్యలు తీసుకున్నామని అన్నారు.

## దుబాయ్ టు హైదరాబాద్.. ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం సీజ్



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీ మొత్తంలో బంగారం పట్టుబడ్డది. సుమారు 1.4 కిలోల బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు తెలిపారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. బంగారం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపిన అధికారులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

# జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్

## – ఔరంగజేబ్ బంధించినపుడు 'ఆగ్రా జైలు' నుంచి శివాజీ ఎలా తప్పించుకున్నారు.?



ఛత్రపతి శివాజీని ఎలాగైనా ఔరంగజేబ్ దర్బారుకు పంపించాలని దక్షిణాన ఔరంగజేబ్ వైస్రాయ్ మీర్జా రాజాసింగ్ కంకణం కట్టుకున్నాడు. కానీ ఆయన్ను అక్కడికి పంపడం అంత సులభం కాదు. పురందర్ ఒప్పందంలో మొఘల్ మన్సబ్ కోసం పనిచేయడానికి, రాజ దర్బారుకు వెళ్లడానికి ఒప్పుకునేది లేదని శివాజీ స్పష్టంగా చెప్పారు. దానికి కొన్ని ప్రత్యేక కారణాలు కూడా ఉన్నాయి. ఔరంగజేబ్ మాటలపై శివాజీకి ఏమాత్రం నమ్మకం లేదు. తన మాట నెగ్గించుకోడానికి ఔరంగజేబ్ ఎంతకైనా తెగిస్తాడని శివాజీ అనుకునేవారు. ప్రముఖ చరిత్రకారుడు జదునాథ్ సర్కార్ తన 'శివాజీ అండ్ హిజ్ టైమ్స్' పుస్తకంలో ఆ ఘటన గురించి రాశారు. "మీరు ఔరంగజేబ్‌ను కలిస్తే ఆయన తర్వాత మిమ్మల్ని దక్కనుకు వైస్రాయ్‌గా చేస్తారేమో. బీజాపూర్, గోల్కొండను ఆక్రమించుకోడానికి తన నాయకత్వంలో ఒక దళాన్ని పంపిస్తారేమో' అని శివాజీని కలిసిన జయ్ సింగ్ ఆయనలో ఆశలు రేపారు. అయితే ఔరంగజేబ్ అలాంటి హామీలు ఏవీ ఇవ్వలేదు" అని చెప్పారు.

### ఆగ్రా బయల్దేరిన శివాజీ

ఔరంగజేబ్‌ను కలిస్తే బీజాపూర్ నుంచి పన్ను వసూలు చేసుకోవడానికి ఆయన తనకు అనుమతి ఇస్తారేమోనని శివాజీ మనసులో అనుకున్నారు. మరాఠా దర్బార్‌లో అదే విషయం మీద చర్చ జరిగినపుడు ఔరంగజేబ్‌ను కలవడానికి శివాజీ ఆగ్రా వెళ్తే బాగుంటుందనే అందరూ నిర్ణయానికి వచ్చారు. దాంతో 1666 మార్చి 5న తల్లి జిజియాబాయికి రాజ్యం బాధ్యతలు అప్పజెప్పి, ఔరంగజేబ్‌ను కలవడానికి ఆగ్రా బయల్దేరారు శివాజీ. శివాజీ భద్రత చూసుకునే బాధ్యతను జయ్ సింగ్ ఆగ్రాలో ఉన్న తన కొడుకు కుమార్ రాం సింగ్‌కు అప్పగించారు. ఆగ్రా రావడానికి ఖర్చుల కోసం శివాజీకి ఔరంగజేబ్ లక్ష రూపాయలు ముందే చెల్లించే ఏర్పాట్లు కూడా చేశారు. ఆ దారిలో ఉండగానే శివాజీకి ఔరంగజేబు నుంచి ఒక లేఖ అందింది. ప్రముఖ చరిత్రకారుడు ఎస్ఎం పగాడీ తన 'ఛత్రపతి శివాజీ' పుస్తకంలో ఆ లేఖలోని వివరాల గురించి రాశారు. "మీరు ఇక్కడకు ఎలాంటి సంకోచం లేకుండా రండి. మీ మనసులో ఎలాంటి ఆందోళన ఉంచుకోకండి. నన్ను కలిశాక మీకు రాచ మర్యాదలు జరుగుతాయి. మిమ్మల్ని తిరిగి గౌరవంగా ఇంటికి వెళ్లనిస్తాం. మీరు వేసుకోడానికి నేను ఖిలాత్ అంటే ఖరీదైన దుస్తులను కూడా పంపుతున్నాను" అని ఆ లేఖలో ఉంది.

### శివాజీకి అవమానం



1666 మే 9న శివాజీ ఆగ్రా శివారు ప్రాంతానికి చేరుకున్నారు. అప్పట్లో ఔరంగజేబ్ దర్బార్ అక్కడే ఉండేది. మే 12న ఆయన ఔరంగజేబ్‌ను కలవాలని చెప్పారు. దర్బారులో 'శివాజీ రాజా' అని గట్టిగా పేరు పిలవగానే, శివాజీ, ఆయన కొడుకు శంభాజీ, పది మంది అనుచరులను ఔరంగజేబ్ సభలోకి తీసుకెళ్లారు కుమార్ రాం సింగ్. మరాఠా రాజ్యం తరఫున ఔరంగజేబ్‌కు 2 వేల బంగారు నాణాలు 'నజర్'గా, 6 వేల రూపాయల 'నిసార్'గా అందించారు. శివాజీ.. ఔరంగజేబ్ సింహాసనం దగ్గరికి వెళ్లి ఆయనకు మూడుసార్లు సలాం చేశారు. ఒక క్షణంపాటు సభ అంతా నిశ్శబ్దం అలుముకుంది. ఔరంగజేబ్ తల ఊపి శివాజీ బహుమతులు స్వీకరించారు. తర్వాత తన సహాయకుడి చెవిలో చక్రవర్తి ఏదో చెప్పారు. దాంతో శివాజీని మూడో హోదాలో ఉండే మన్సబుదారుల కోసం అప్పటికే ఏర్పాటు చేసిన వరుసలోకి తీసుకెళ్లారు. సభ ఎప్పటిలాగే నడుస్తోంది. కానీ, తనకు అలాంటి స్వాగతం లభిస్తుందని శివాజీ ఊహించలేదు.

### బుసలుకొట్టిన శివాజీ కోపం

ఆ సమయంలో శివాజీ ఎలా స్పందించారో జదునాథ్ సర్కార్ తన పుస్తకంలో రాశారు. ఆగ్రా బయట తనకు స్వాగతం పలకడానికి రామ్ సింగ్, ముఖ్లిస్ ఖాన్ లాంటి మామూలు అధికారులను ఔరంగజేబ్ పంపించడం శివాజీకి నచ్చలేదు. సభలో తల వంచిన తన గురించి ఒక మంచి మాట చెప్పడం గానీ, ఆయనకు ఏదైనా బహుమతులు ఇవ్వడం గానీ చేయలేదు. దానికి తోడు ఆయన్ను సాధారణ మన్సబుదారుల మధ్యలో ఎన్నో వరుసల వెనక నిలబెట్టారు. అక్కడ నుంచి ఔరంగజేబ్ కూడా సరిగా కనిపించడం లేదు. అప్పటికే శివాజీ కోపం కట్టలుతెంచుకుంది. ఆయన రామ్ సింగ్‌తో "నన్ను ఎవరి మధ్య తీసుకొచ్చి నిలబెట్టావ్" అని అడిగారు. రాం సింగ్ ఆయనతో "మీరు పాంచ్ హజారీ (5 వేల మంది సైనికులకు అధిపతి) మన్సబ్‌దారుల మధ్య ఉన్నారు" అని చెప్పారు. దాంతో శివాజీ బిగ్గరగా "నా ఏడేళ్ల కొడుకు, నా నౌకర్ నేతాజీ కూడా పాంచ్ హజారీలే. చక్రవర్తి అని గౌరవించి, అంత దూరం నుంచి ఆగ్రా వచ్చిన నన్ను వీళ్లతో పోల్చుతారా" అన్నారు. తర్వాత శివాజీ "నా ముందు ఉన్నది ఎవరు" అన్నారు. "రాజా రాయ్ సింగ్ సిసోడియా" అన్నాడు రాం సింగ్. దాంతో శివాజీ గట్టిగా "రాయ్ సింగ్%ొా% రాజా జయ్ సింగ్ చేతి కింద వాడు. మీరు నన్ను వాళ్ల వరుసలో నిలబెడతారా" అని గద్దించారు.

### ఔరంగజేబ్‌కు రాం సింగ్ వివరణ



ఔరంగజేబ్ పదేళ్ల పాలనపై 'ఆలంగీర్‌నామా' పుస్తకం రాసిన మొహమ్మద్ కాజిమ్ అందులో ఆ తర్వాత ఏం జరిగిందో రాశారు. తనకు ఘోర అవమానం జరగడంతో రగిలిపోయిన శివాజీ రాం సింగ్‌తో గట్టిగట్టిగా మాట్లాడుతున్నారు. ఆయన దర్బార్‌లో అలా మాట్లాడుతుండడంతో రాం సింగ్ కంగారు పడిపోయి శివాజీ కోపం చల్లార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ శివాజీ శాంతించలేదు. కాసేపు అక్కడ నిలుచున్న శివాజీ తర్వాత ఆ వరుస నుంచి బయటికొచ్చి ఒక మూల కూర్చున్నారు. శివాజీ గట్టిగా అరవడం విన్న ఔరంగజేబ్.. ఆ అరుపులేంటి అన్నారు. దాంతో రాం సింగ్ చాకచక్యంగా జవాబు చెప్పారు. "సింహం అడవి జంతువు, అది ఇక్కడ ఉక్కపోతను భరించలేక, జబ్బు పడింది" అన్నారు. క్షమించమని ఔరంగజేబ్‌ను కోరిన రాం సింగ్.. దక్కన్ నుంచి వచ్చిన మహానుభావ్‌కు చక్రవర్తి దర్బార్ నియమాల గురించి తెలీదని చెప్పారు. దాంతో శివాజీని పక్కనున్న గదిలోకి తీసుకెళ్లి ఆయనపై పన్నీరు చల్లాలని ఔరంగజేబ్ చెప్పారు. ఆయన కుదుటపడిన తర్వాత, దర్బారు ముగిసేవరకూ వేచిచూడకుండా శివాజీని నేరుగా ఆయన కోసం ఏర్పాటు చేసిన విడిది ప్రాంతానికి తీసుకెళ్లాలని సూచించారు.

### శివాజీ ఉన్న భవనాన్ని చుట్టుముట్టారు

ఆగ్రా నగరం నాలుగు గోడల బయట జయ్‌పూర్ సరాయ్‌లో శివాజీకి విడిది ఏర్పాటు చేయాలని రాం సింగ్‌కు ఆదేశాలు అందాయి. శివాజీ జయ్‌పూర్ నివాసంలోకి వెళ్లగానే, ఒక అశ్విక దళం ఆ ఇంటిని నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టింది. కాసేపటికే మరికొందరు సైనికులు అక్కడికి చేరుకున్నారు. వాళ్లు తమ ఫిరంగులను భవనానికి ఉన్న ప్రతి తలుపు వైపూ గురిపెట్టారు. కానీ సైనికులతో రహస్యంగా నిఘా పెట్టిన కొన్ని రోజులకు ఔరంగజేబ్‌కు శివాజీని చంపాలనే ఉద్దేశం లేదనే విషయం అర్థమైంది. డెనిస్ కింకెడ్ తన 'శివాజీ ద గ్రేట్ రెబల్' పుస్తకంలో ఆ సమయంలో జరిగిన వాటి గురించి వివరించారు. అయితే శివాజీకి తను ఉన్న ఆ భవనం నుంచి బయటకు వెళ్లడానికి అనుమతి లేదు. కానీ అప్పుడు కూడా ఔరంగజేబ్ నుంచి ఆయనకు అప్పుడప్పుడూ గౌరవ సందేశాలు వస్తూనే ఉన్నాయి. చక్రవర్తి ఆయనకు పండ్ల బుట్టల కూడా పంపించేవారు. శివాజీ ఆ తర్వాత ఔరంగజేబ్ ప్రధాన వజీర్ ఉమ్‌దావుల్ ముల్క్‌కు ఒక సందేశం పంపించారు. చక్రవర్తి నన్ను సురక్షితంగా తిరిగి పంపిస్తానని హామీ ఇచ్చారు. కానీ అది జరిగేలా ఏమాత్రం కనిపించడం లేదు అన్నారు. తనను చంపించడానికి తగిన సాకు కోసం ఔరంగజేబ్ వేచిచూస్తున్నాడని, కోపంలో





ఏదైనా చేసేలా తనను మెల్లమెల్లగా రెచ్చగొట్టాలనుకుంటున్నాడని శివాజీకి అర్థమైంది.

### హఠాత్తుగా మారిన శివాజీ ప్రవర్తన

భవనంలో బందీలా ఉన్న శివాజీపై నిఘా పెట్టిన సైనికులకు ఆయన ప్రవర్తనలో హఠాత్తుగా మార్పు అనిపించింది. ఆయన చాలా సంతోషంగా ఉన్నట్టు కనిపిస్తోంది. తనకు కాపలాగా ఉన్న సైనికులతో ఆయన నవ్వుతూ సరదాగా మాట్లాడుతున్నారు. సైనికాధికారులకు ఎన్నో బహుమతులు పంపిస్తున్నారు. ఆగ్రా వాతావరణం తనకు బాగా నచ్చిందని చెబుతున్నారు. తన కోసం ఎన్నో తీపి వంటకాలు, పండ్లు పంపిస్తున్న చక్రవర్తికి చాలా రుణపడి ఉంటానని శివాజీ అనడం కూడా విన్నారు. పాలన కార్యకలాపాలకు దూరంగా ఆగ్రా లాంటి సాంస్కృతిక నగరంలో ఉండడం చాలా



హాయిగా ఉందని శివాజీ వాళ్లతో అన్నారు. ఈలోపు ఔరంగజేబ్ గూఢచారులు ఆయనపై రాత్రింబవళ్లు నిఘా పెడుతూనే ఉన్నారు. శివాజీ ప్రస్తుతం చాలా సంతృప్తిగా కనిపిస్తున్నారని వాళ్లు తమ చక్రవర్తికి ఒక సందేశం కూడా పంపించారు. ఔరంగజేబ్‌కు మరింత నమ్మకం కలిగేలా, తన తల్లి, భార్య కూడా తన దగ్గరకు వచ్చి ఉండడానికి అనుమతిస్తారా అని శివాజీ చక్రవర్తికి ఒక సందేశం కూడా పంపించారు. ఔరంగజేబ్ దానికి సరే అన్నారు. తమ ఇంటి ఆడవాళ్లను బందీలుగా చేసే వ్యక్తి, ఎప్పటికీ పారిపోయే సాహసం చేయడని ఔరంగజేబ్‌కు మనసులో అనిపించింది. కానీ, చక్రవర్తి అనుమతి లభించినా శివాజీ కుటుంబంలోని మహిళలు ఆగ్రాకు రాలేదన్నది వాస్తవం.



బహుశా, ఆ ప్రాంతంలో భారీ వర్షాల వల్ల వాళ్లు అంత సుదీర్ఘ ప్రయాణం చేయలేకపోయారని ఒక కారణంగా చెబుతారు. కొన్ని రోజుల తర్వాత తనతోపాటూ వచ్చిన మరాఠా అశ్వికులను తిరిగి తమ రాజ్యానికి పంపించాలని శివాజీ.. చక్రవర్తికి సందేశం పంపించారు. చక్రవర్తి స్వయంగా మరాఠా సైనికులను వదిలించుకోవాలని అనుకుంటున్నారు. శివాజీ స్వయంగా అలా అడిగేసరికి ఆయన సంతోషపడిపోయారు.

### అనారోగ్యం సాకుతో






తర్వాత తనకు అనారోగ్యంగా ఉందని శివాజీ సాకు చెప్పారు. బయట కాపలా ఉన్న మొఘల్ సైనికులకు ఆయన మూలుగులు కూడా వినిపిస్తున్నాయి. తన ఆరోగ్యం కుదుటపడాలని ఆయన ఇంటి బయట బ్రాహ్మణులకు, సన్యాసులకు ప్రతి సాయంత్రం బుట్టల్లో మిఠాయిలు, పళ్లు కూడా పంపించేవారు. బయట కాపలా కాస్తున్న సైనికులు కొన్ని రోజులు బయటకు వెళ్తున్న బుట్టలను తనిఖీ చేశారు. తర్వాత వాళ్లు వాటిని పట్టించుకోవడం మానేశారు. జదునాథ్ సర్కార్ తన పుస్తకం 'శివాజీ అండ్ హిజ్ టైమ్స్'లో ఆయన ఎలా తప్పించుకున్నారో వివరించారు. 1666 ఆగస్టు 19న శివాజీ బయట ఉన్న సైనికులకు తనకు చాలా అనారోగ్యంగా ఉన్నట్టు, పడుకున్నట్టు తెలిసేలా చేశారు. తన విశ్రాంతికి భంగం కలిగించవద్దని, ఎవరినీ లోపలికి పంపించవద్దని చెప్పించారు. అచ్చం తనలాగే కనిపించే తన సవతి సోదరుడు హీరాజీ ఫర్జాంద్‌కు తన బట్టలు, ముత్యాల హారం వేసి మంచంపై పడుకోబెట్టారు. శివాజీ కడియం ఉన్న ఆయన చెయ్యి మాత్రమే కనిపించేలా మిగతా శరీరం అంతా ఒక దుప్పటి కప్పేశారు. శివాజీ, ఆయన కొడుకు శంబాజీ వెదుర్ల సాయంతో భుజాలపై మోసే ఒక పళ్ల బుట్టలో కూర్చున్నారు. దానిని కూలీలు భవనం నుంచి బయటకు తీసుకొచ్చారు. కాపలా కాస్తున్న సైనికులు ఆ బుట్టలను తనిఖీ చేయాలనుకోలేదు. కూలీలు ఆ బుట్టలను నగరంలో నిర్మానుష్యంగా ఉన్న వీధుల్లోంచి తీసుకెళ్లారు. బయటకు చేరుకున్న తర్వాత కూలీలను తిరిగి పంపించేశారు. శివాజీ, ఆయన కొడుకు బుట్టల్లోంచి బయటకొచ్చి ఆగ్రా నుంచి ఆరు మైళ్ల దూరంలోని ఒక గ్రామం చేరుకున్నారు. అక్కడ ఆయన ప్రధాన న్యాయమూర్తి నీర్జీ రావ్‌జీ వాళ్ల కోసం ఎదురుచూస్తున్నారు.

### ఔరంగజేబ్‌కు చెమటలు పట్టాయి

మరో చరిత్రకారుడు ఎస్ఎమ్ పగాడీ తన 'ఛత్రపతి శివాజీ'లో ఇదే ఘటన గురించి మరో విధంగా చెప్పారు. "శివాజీ బుట్టలో దాక్కుని బయటికి వచ్చాడని అనుకోలేం. ఆయన పూర్తిగా నిస్సహాయ స్థితిలో బుట్టలో కూర్చునే లాంటి వ్యక్తి కాదు. ఆయన తొమ్మిదేళ్ల కొడుకు శంభాజీ కచ్చితంగా బుట్టలో కూర్చుని ఉంటాడు. కానీ శివాజీ కూలీ వేషంలో స్వయంగా ఆ బుట్ట మోసుకెళ్లి ఉంటారు" అన్నారు. ఈలోపు హీరాజీ ఫర్జాంద్ రాత్రంతా, తర్వాత రోజు మధ్యాహ్నం వరకూ అలా పడుకునే ఉన్నారు. గదిలోకి తొంగి చూసిన సైనికులకు ఆయన చేతికున్న శివాజీ బంగారు కడియం



కనిపించేది. దాంతో ఆయన అక్కడే పడుకుని ఉన్నారనుకునేవారు. నేల మీద కూర్చున్న మరో వ్యక్తి ఆయనకు మాలిష్ చేయడం కనిపించేది. సుమారు 3 గంటల సమయంలో హీరాజీ ఒక నౌకరుతో కలిసి ఆ ఇంటి నుంచి బయటపడ్డారు. వెళ్తూ వెళ్తూ "గట్టిగా అరవకండి, శివాజీకి ఆరోగ్యం సరిగా లేదు, ఆయనకు వైద్యం జరుగుతోంది" అని చెప్పారు. కాసేపటికి శివాజీ గది నుంచి ఎలాంటి శబ్దాలూ రాకపోవడంతో సైనికులకు సందేహం వచ్చింది. లోపలికెళ్లి చూస్తే అక్కడ ఎవరూ లేరు. వారు, ఆ విషయం మొదట తమ నాయకుడు ఫలాద్ ఖాన్‌కు చెప్పారు. షాకైన ఫలాద్ ఖాన్ ఔరంగజేబ్ దగ్గరకు వెళ్లి, ఆయన కాళ్లపై పడిపోయాడు. ఆయన నోట "అంతా మాయ..మాయ.. శివాజీ అదృశ్యం అయిపోయాడు. ఆయన గాల్లో ఎగిరెళ్లారో లేక ఆయన్ను భూమి మింగేసిందో నాకు తెలీడం లేదు" అన్నాడు. అది వినగానే ఔరంగజేబ్‌కు కూడా చెమటలు పట్టాయి. తన రెండు చేతులతో తల పట్టుకున్న ఆయన చాలాసేపటి వరకూ అలాగే కూర్చుండిపోయారు. వెంటనే నలువైపులా తన సైనికులను పంపించి శివాజీ కోసం వెతికించారు. అధికారులను పరుగులు పెట్టించారు. కానీ, వారందరూ వట్టి చేతుల్తో వెనక్కు వచ్చారు.

### మరోదారిలో రాజ్‌గఢ్ చేరిన శివాజీ

శివాజీ తెలివిగా, మహారాష్ట్ర చేరుకోవడానికి పూర్తిగా భిన్నంగా ఉండే మార్గాన్ని ఎంచుకున్నారు. నైరుతి దిశగా మాల్వా, ఖాన్‌దేశ్ మీదుగా వెళ్లడానికి బదులు, ఆయన తూర్పు దిశగా వెళ్లాలని అనుకున్నారు. మధుర, అలహాబాద్, వారణాసి, పూరీ మీదుగా గోండ్వానా(ఒడిషా), గోల్కొండ దాటి తిరిగి రాజ్‌గఢ్ చేరుకున్నారు. ఔరంగజేబ్ పట్టు నుంచి బయటకు వచ్చిన ఆరు గంటల్లోనే ఆయన మధుర చేరుకున్నారు. అక్కడ శివాజీ తన జుట్టు, గడ్డం, మీసాలు తీయించుకున్నారు. ఒక సామాన్యుడి వేషంలో కాషాయ బట్టలు ధరించారు. డిసెంబర్‌లో ఒక ఉదయం శివాజీ తల్లి జిజియాబాయి తన గదిలో ఒంటరిగా కూర్చుని ఉన్నప్పుడు.. ఆమె సేవకుడు లోపలికొచ్చాడు. అమ్మా, ఒక సన్యాసి మిమ్మల్ని కలవాలని అంటున్నాడని చెప్పారు. ఆమె ఆయన్ను లోపలికి పంపించమని చెప్పారు. ఆ సన్యాసి లోపలికి రాగానే, జిజియాబాయి కాళ్లకు నమస్కరించాడు. ఆమె ఆయనతో "సాధువులు వేరే వారి కాళ్లపై ఎప్పటి నుంచి పడుతున్నారు" అన్నారు. జిజియాబాయి తన చేతులతో పైకి లేపి, ఆ సాధువు ముఖం చూడగానే గట్టిగా 'శివాబా' అని అరిచారు.

# గుండె నుంచి చర్మం వరకు.. గుడ్డుతో బోలెడు ప్రయోజనాలు..



గుడ్డు.. వెరీగుడ్ ఫుడ్. తక్కువ ఖరీదైనది.. ఎన్నో పోషకాలు కలిగి ఉన్నది. దీనిలో అతి తక్కువగా 78 క్యాలరీలు ఉంటాయి. గుడ్డులో విటమిన్ ఏ, బీ2, బీ5, బీ12, ఫోలేట్, ఫాస్పరస్, సెలీనియం ఉండి మనకు కావాల్సిన పోషకాలన్నీ అందుతాయి. అన్ని వయసుల వారు తినే ఏకైక ఆహారం ఇది. పచ్చసొనలో ఉండే కోలెస్ట్రాల్ అన్ని రకాల జీవక్రియలకు ఉపయోగపడుతుంది. వీటిని తినడం ద్వారా స్ట్రోక్, కార్డియాక్ మరణాలు, కార్డియోవాస్కులార్ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. స్త్రీలలో రొమ్ము క్యాన్సర్ నివారణకు తెల్ల సొన ఎంతో తోడ్పడుతుంది. ఉదయం వేళ గుడ్డును అల్పాహారంగా తీసుకుంటే ఊబకాయం నుంచి బయటపడొచ్చు.

**బరువు తగ్గించుకోవచ్చు..** గుడ్లలో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఎక్కువసేపు ఆకలికాకుండా మనల్ని ఉంచడంలో సాయపడుతుంది. శరీరం బరువు తగ్గడానికి సహాయపడుతుంది. బరువు పెరగాలనుకునే వారు కూడా గుడ్లను తినొచ్చు.

**విటమిన్ డీ దొరుకుతుంది..** గుడ్డు సొనలో విటమిన్ డీ ఉంటుంది. విటమిన్ డీ.. ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా అవసరం. కండరాల పనితీరును ప్రోత్సహించడంలో కూడా సాయపడుతుంది.

**మెదడు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది..** ఇది మెదడును అభివృద్ధి చేయడంలో సాయపడుతుంది. నాడీ వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేయడంలో తోడ్పడుతుంది. ఇందులో లభించే కోలిన్, లూటిన్ మంటలను తగ్గిస్తాయి. జ్ఞాపకశక్తి సమస్యలను దూరం చేస్తాయి.

గుడ్లలో లభించే సెలీనియం, విటమిన్ఏ, బీ12, జింక్ కారణంగా రోగనిరోధక శక్తి మెరుగవుతుంది.

మనకు సత్వరమే శక్తి అందాలంటే గుడ్లు తినాలి.గుడ్లు తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. స్ట్రోక్ ప్రమాదం తగ్గుతుంది. గుడ్డులోని కోలిన్ గుండె జబ్బులకు కారణమయ్యే అమినో యాసిడ్ హెూమోసిస్టీన్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. అంతేకాకుండా శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతుంది.గర్భిణులు నిత్యం గుడ్లు తప్పనిసరిగా తీసుకోవడం అలవర్చుకోవడం ద్వారా ఫోలిక్ యాసిడ్ అందుతుంది. ఫోలిక్ యాసిడ్ పుట్టుకతో వచ్చే లోపాలను నివారిస్తుంది. అయితే, పూర్తిగా ఉడికినవి మాత్రమే తినాలి. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఆహారంలో గుడ్లను చేర్చుకోవడం అత్యుత్తమం. గుడ్లలో ఉండే లూటిన్, జియాక్సంతిన్ కండరాల క్షీణతను, కంటి శుక్లం సమస్యలను నివారించడంతోపాటు కంటి చూపును మెరుగుపరుస్తుంది.



గుడ్లు తినడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా ఆరోగ్యకరమైన చర్మాన్ని కూడా వృద్ధి చేస్తుంది. ఇది కణజాలం విచ్ఛిన్నం కాకుండా నిరోధిస్తుంది. చర్మానికి అవసరమైన తేమను అందిస్తుంది. ఫ్రై చేసిన గుడ్లు తినాలా లేక ఉడకబెట్టిన గుడ్లు తినాలా..? పచ్చి కోడిగుడ్డు తినొచ్చా..? అని చాలా మందిలో ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతుంటాయి.

అయితే, బాగా ఉడకబెట్టిన గుడ్లను తినడమే చాలా మంచిది. పచ్చిగా తింటే బయోటిన్‌తో కలిసిపోయి దాన్ని శరీరం వినియోగించుకోకుండా అడ్డుకుంటుంటుంది. పచ్చ సొన, తెల్ల సొన రెండూ తిన్నా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. అయితే, మందులతో పెరిగే ఫారం కోడి గుడ్లను తినడం తగ్గించాలి. ఇకపోతే గుడ్డు పెంకుకు అందులోని పోషకాలకు ఎలాంటి సంబంధం ఉండదని గుర్తుంచుకోవాలి.

# పురుషుల్లో పునరుత్పత్తి ఆరోగ్య రక్షణ..

## - అందుబాటులో సంతానోత్పత్తి సప్లిమెంట్లు



పెళ్లై అలా ఏడాది గడిచిపోయిందో లేదో.. మనవడు, మనవరాలు అంటూ పోరు అందరి ఇళ్లలో మొదలవడం మనం చూస్తున్నాం. ఏమన్నా విశేషమా? అంటూ అందరూ అడుగుతుంటారు. ఈ మాటలు అటు ఆడవారిని, ఇటు మగవారిని బాధపెడుతుందని తెలిసినా వారు ప్రశ్నించడం మాత్రం ఆపరు. కొన్నిండ్లల్లో పిల్లలు పుట్టకపోతే ఆడవారి తప్పే అన్నట్లుగా దెప్పి పొడుస్తుంటారు. కానీ, పిల్లలు పుట్టకపోవడానికి పురుషులు కూడా కారణమని తెలిసినా పట్టించుకోరు. కొన్ని పరిశోధనల ప్రకారం, మూడింట ఒక వంతు పురుషుల్లో వంధ్యత్వం ఉంటుంది. వంధ్యత్వం అనేది మహిళలకు సంబంధించింది కాదు. అయితే, పురుషుల్లో పునరుత్పత్తి ఆరోగ్య రక్షణకు సంతానోత్పత్తి సప్లిమెంట్లు మార్కెట్లో దొరుకుతున్నాయి.మగ సంతానోత్పత్తి సప్లిమెంట్లు విటమిన్లు, ఖనిజాలతోపాటు ఆరోగ్యకరమైన శుక్ర కణాల ఉత్పత్తికి సహాయపడే మూలికలు ఉంటాయి. ఈ సప్లిమెంట్లు స్పెర్మ్ మొటిలిటీ, స్వరూపం, సంఖ్య పెరుగుదల, పనితీరు మొదలైన వాటితో సహా కీలకమైన వీర్య కారకాలను పెంచడం ద్వారా సంతానోత్పత్తిని ఆప్టిమైజ్ చేయడంలో సహాయపడతాయి. ఈ పురుష సంతానోత్పత్తి సప్లిమెంట్ల వాడకం వల్ల ఫలితాలు ఉన్నాయని, ఆరోగ్యకరమైన స్పెర్మ్‌ను ఉత్పత్తి చేసే అవకాశాలను పెంచినట్లు బలమైన శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయని వైద్యనిపుణులు సెలవిస్తున్నారు. విటమిన్ సీ శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది స్పెర్మ్ దెబ్బతినకుండా కాపాడుతుంది. శుక్ర కణాల సంఖ్యను పెంచడంతోపాటు ఇతర స్పెర్మ్ ఆరోగ్య సూచికలను మెరుగయ్యేట్లు చేస్తుంది. విటమిన్ సీ సప్లిమెంట్లను తీసుకున్న తర్వాత కొంతమంది వ్యక్తుల స్పెర్మ్ కౌంట్ రెండు రెట్లు పెరిగినట్లు ఒక అధ్యయనం తేల్చింది. ఇదేసమయంలో బలహీనంగా తయారైన స్పెర్మ్ కణాల సంఖ్య తగ్గింది. ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిలో స్పెర్మ్ మొటిలిటీలో మెరుగుదల కనిపించింది. స్పెర్మ్ ఆక్సీకరణ ఒత్తిడి, ఇతర రకాల విధ్వంసం నుంచి ఈ ఎంజైమ్ రక్షిస్తుంది. %జశీ%10 సెమినల్ ఫ్లూయిడ్‌లో ఉండి.. పెద్ద స్థాయిలు పెరిగిన స్పెర్మ్ మొటిలిటీ, శుక్రకణాల సంఖ్యతో సంబంధం కలిగి ఉంటుంది. %జశీ%10 సప్లిమెంట్లను తీసుకోవడం వల్ల వీర్యంలోని విటమిన్ మొత్తాన్ని పెరిగేలా చేసి సంతానోత్పత్తిని పెంచుతుందని ఇటీవలి అధ్యయనం తెలిపింది. ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్ల స్థాయిలు -ఆరోగ్యకరమైన పురుష పునరుత్పత్తి మధ్య బలమైన సహసంబంధాన్ని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇవి స్పెర్మ్ కణాలతో పాటు అనేక రకాల కణాలకు సరైన నిర్మాణాన్ని అందిస్తాయి. సముద్ర ఉత్పత్తులను ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా ఒమెగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ పొందవచ్చు. లైకోపీన్ సహజమైన టొ వ టో రంగుగా ప్రసిద్ధి చెందినప్పటికీ, దీనితో అనేక ఇతర ఉపయోగాలు కూడా ఉన్నాయి. ఈ క్రిమ్సన్ రసాయనం స్పెర్మ్ సంఖ్యను 70 శాతం వరకు పెంచవచ్చు. స్పెర్మ్ మొటిలిటీతో పాటు సంఖ్యను పెంచుతాయని అనేక అధ్యయనాల్లో తేలింది. స్పెర్మ్ కౌంట్‌తోపాటు సంతానోత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సాయపడేందుకు ఎక్కువ మొత్తంలో టమాటలు తీసుకోవాలి. లేదా లైకోపీన్ కలిగిన సప్లిమెంట్‌ను చేర్చుకోవాలి. విటమిన్ బీ 12 శుక్రకణాల తయారీ ప్రక్రియకు ఎంతో అవసరమైనది.

ఆరోగ్యకరమైన స్పెర్మ్ కౌంట్‌ను ప్రోత్సహించడంలో విటమిన్ బీ 12 సప్లిమెంటేషన్ యాంటీ ఆక్సిడెంట్‌లతో సమానంగా సమర్ధవంతంగా ఉంటుందని అధ్యయనాలు చూపాయి. పురుషుల్లో వంధ్యత్వం రావడానికి ముఖ్య కారణాల్లో వెరికోసెల్ ఇన్‌ఫెక్షన్లు, హైడ్రోసిల్, హార్మోన్ల సమస్యలతోపాటు జీవనశైలికి సంబంధించిన అలవాట్లు, పర్యావరణం కూడా ఉన్నాయి. అయితే, ఏదైనా సప్లిమెంట్లను తీసుకోవడానికి ముందు వైద్యనిపుణులను సంప్రదించి వారి సలహాలు తీసుకోవడం చాలా అవసరం.

# జలుబుకు ఔషధంగా

## చికెన్ సూప్ ఎలా పనిచేస్తుందంటే..?



బాగా జలుబు చేసినప్పుడు చాలామంది చికెన్ సూప్ చేయించుకుని తాగడం లేదా సూప్‌లా వండిన చికెన్‌గ్రేవీతో అన్నం తినడం చేస్తుంటారు. చాలామంది ఇది ఓ సంప్రదాయ చికిత్స అనుకుంటారుగానీ... నిజానికి చికెన్‌సూప్ ఉపశమనానికి బాగానే పనిచేస్తుంది. దీనికి శాస్త్రీయ కారణాలూ ఉన్నాయి. సూప్‌లా వండిన చికెన్‌లో 'సిస్టిన్/సిస్టయిన్' అనే అమైనో యాసిడ్ ఉంటుంది. ఇది మాత్రమే గాకుండా... ఇలా వండే సమయంలో ఆ సూప్‌లోకి ఖనిజ లవణాలూ, విటమిన్లతో పాటు మంచి పోషకాలన్నీ ద్రవంలా ఉడికే సూప్‌లోకి స్రవిస్తాయి. ఇదే సూప్‌లోకి 'గ్లైసిన్', 'ప్రోలైన్' లాంటి అనేక అమైనో యాసిడ్స్ సముదాయమైన జిలాటిన్ కూడా స్రవిస్తుంది. ఈ అమైనో యాసిడ్‌లూ, ఇతర పోషకాలు కలగలసిన సూప్ మన వ్యాధి నిరోధకశక్తిని మరింతగా పెంచుతుంది. ఈ అంశాలన్నీ జలుబు ఇతరత్రా ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. అంతేకాదు... ఈ చికెన్‌సూప్ దాదాపు ద్రవరూపంలో ఉండటం త్వరగా జీర్ణం కావడంతో పాటు అన్ని పోషకాలను వేగంగా దేహానికి అందిస్తుంది. జీర్ణశక్తినీ, కాలేయం పనితీరును మెరుగుపరిచి, ఎముకలను మరింత పటిష్ఠం చేయడానికీ చికెన్‌సూప్ దోహదపడుతుంది.

# ఈ అనారోగ్యాలు దరి చేరొద్దంటే.. మీ డైట్‌లో బీట్‌రూట్ ఉండాల్సిందే

రక్తహీనత సమస్య చాలామందిలో ఉంటుంది. ఈ సమస్య నుంచి బయటపడటానికి కొన్ని రకాల పండ్లు, కూరగాయలను క్రమం తప్పకుండా తీసుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా బీట్‌రూట్‌ను డైట్‌లో భాగం చేసుకోవాలి. బీట్‌రూట్‌ను రెగ్యులర్‌గా తినడంవల్ల రక్తం వృద్ధి చెందుతుంది. శరీరానికి అనేక పోషకాలు అందుతాయి. చెడు కొలెస్టరాల్‌ను తగ్గించడంలో, హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో బీట్‌రూట్ ముఖ్యపాత్ర పోషిస్తుంది. అంతేగాక బీట్‌రూట్‌తో ఇంకా చాలా ప్రయోజనాలున్నాయి. అవేంటో తెలుసుకుందాం..

బీట్‌రూట్‌తో ప్రయోజనాలు..

1. బీట్‌రూట్‌లో బీటాలైన్స్ అనే ఫైటోన్యూట్రియంట్స్, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాల కారణంగా కడుపులోని దీర్ఘకాలిక మంట నివారించబడుతుంది. బీట్‌రూట్ తీసుకోవడంవల్ల కీళ్లలో నొప్పి కూడా తగ్గుతుంది.
2. దీనిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఒక కప్పు బీట్‌రూట్ జ్యూస్‌లో గ్లూటామైన్, అమైనో ఆమ్లాలు, 3.4 గ్రాముల ఫైబర్ కంటెంట్ ఉంటుంది. ఇది మలబద్ధకం, పేగు వ్యాధులు, పెద్దపేగు క్యాన్సర్ వంటి ప్రమాదాలను తగ్గిస్తుంది. జీవక్రియలను మెరుగుపరుస్తుంది. కేలరీలు తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువసేపు ఎనర్జీగా ఉంచుతుంది.
3. బీట్‌రూట్‌లో ఉండే నైట్రేట్లు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. ఇవి రక్త నాళాలను ముడుచుకోకుండా చేయడానికి, మెదడుకు రక్త ప్రవాహాన్ని పెంచడానికి సహాయపడుతాయి. తద్వారా మెదడు పనితీరు వృద్ధి చెందుతుంది.
4. అదేవిధంగా బీట్‌రూట్‌లలో ఉండే డైటరీ నైట్రేట్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో, గుండెపోటు నుంచి రక్షించడంలో తోడ్పడుతుంది.
5. బీట్‌రూట్‌లు తెల్ల రక్త కణాల ఉత్పత్తిని సులభతరం చేస్తాయి. అంతేకాక అసాధారణ కణాల పెరుగుదలను, కణితి కణాల విభజనను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లలో ఉండే విటమిన్ బి6, సి, ఫోలిక్ యాసిడ్, పొటాషియం, మెగ్నీషియం, ప్రొటీన్, ఐరన్, ఫాస్పరస్ వంటి పోషకాలు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను దూరం చేయడంలో సహాయపడుతాయి. కాబట్టి, ఆరోగ్యకరమైన పోషకాల కోసం రోజూవారి డైట్‌లో బీట్‌రూట్ ఉండేలా

# లవ్ బాంబ్ పడిందా?



ప్రేమ మధురానుభూతి. తీయని మత్తు. ఎదుటివాళ్లను ఆ మైకంలో పడేసి కీలు బొమ్మగా మార్చుకోవాలని చూసేవారూ ఉంటారు. తొలుత అంతా బాగానే అనిపించినా.. క్రమంగా ఆ బంధం హింసాత్మకం అవుతుంది. దీన్నే 'లవ్ బాంబింగ్' అని పిలుస్తున్నారు. ఏది అసలైన ప్రేమో, ఏది లవ్ బాంబింగో తెలుసుకోవడం పెద్ద కష్టమేం కాదు. బహుమతులు అందుకుంటున్నప్పుడు సంతోషంగానే ఉంటుంది. కానీ అస్సలు ఊహించని లేదా ఏమాత్రం అవసరంలేని విలువైన బహుతులు ఇస్తున్నారంటే మాత్రం ఓసారి ఆలోచించాల్సిందే. ఖరీదైన ఫ్లైట్ టికెట్లు బుక్ చేయడం, ఒకటికి పది బొకేలు పంపడం.. ఇలాంటి ఎత్తులే. వీటిని తీసుకోవడం ద్వారా వారికి రుణపడి ఉన్నామన్న భావన కలిగిస్తారు. పొగడ్త మిఠాయిలా తియ్యగా ఉంటుంది. కానీ ఎవరైనా విపరీతంగా కీర్తిస్తున్నారంటే ఏదో తేడా ఉన్నట్టు లెక్క. లవ్‌బాంబింగ్ చేసే వ్యక్తులు 'నువ్వేం చేసినా నాకు నచ్చుతుంది', 'అసలు నీలాంటి మనిషిని ఇప్పటి వరకూ కలవనే లేదు', 'నాకు రోజంతా నీతోనే గడపాలనుంది'..లాంటి అతిమాటలు మాట్లాడతారు. నిరంతరం ఫోన్లు చేయడం, క్షేమ సమాచారం తెలుసుకోవడానికి అన్నట్టు మాటిమాటికీ మెసేజ్‌లు పెట్టడం.. ఓ మెత్తని కుట్ర. మీరు ఎక్కడున్నా సరే మొత్తం సమయాన్ని తమకే కేటాయించేలా ఓ వ్యూహం.మీరు వేరే మనిషి గురించి మాట్లాడినా ఓర్చుకోలేరు. మిత్రుల్ని కలవాల్సి ఉందని చెప్పినా కదలనివ్వరు. నిజమైన ప్రేమ నీ పూర్తి సమయాన్నీ, శక్తినీ, ధ్యాసనీ%ఔ%సర్వస్వాన్నీ ఎప్పుడూ కోరుకోదు. వ్యక్తిగత కమిట్‌మెంట్స్‌కు కూడా విలువ ఇస్తుంది.మెసేజ్‌కి రిట్కప్లై ఇవ్వకపోతే అలుగుతారు. ఎక్కడికి వెళ్లాలన్నా తోడుగా వస్తారు. వాళ్లు లేకుండా కదలలేని పరిస్థితి కల్పిస్తారు. మొదట్లో బాగానే ఉన్నా, తర్వాత తర్వాత మీ ప్రపంచం మీకే ఇరుకుగా అనిపిస్తుంది. మిమ్మల్ని ఎవరో అధీనంలోకి తీసుకున్న భావన కలుగుతుంది.

# సముద్రంలో తేలియాడే నగరం.. పంటలు కూడా.. ఎక్కడో తెలుసా?



ప్రపంచవ్యాప్తంగా సాగరతీరాల్లో ఉన్న నగరాలు తక్కువేమీ కాదు గాని, సాగరంలోని అలలపై తేలియాడే నగరం ఎక్కడైనా ఉందంటే అది వింతే! అలాంటి వింతనే దక్షిణ కొరియా ఆవిష్కరించింది. ప్రపంచంలోనే తొలి తేలియాడే నగరాన్ని బ్యూసన్ సాగరతీరానికి ఆవల సముద్రం అలలపై నిర్మించింది. 'ఓషియానిక్స్' పేరిట పూర్తి జనావాసానికి అనుకూలమైన నగరాన్ని దక్షిణ కొరియా ప్రభుత్వం ఐక్యరాజ్య సమితి సహకారంతో నిర్మించింది. త్వరలోనే ఇది పర్యాటకుల రాకపోకలకు, నౌకల రవాణాలకు అనువుగా సిద్ధం కానుంది. సముద్రంలో తేలియాడే ఈ నగరంలో రకరకాల ఆహార పంటలను పండిస్తుండటం, పండ్ల తోటలను పెంచుతుండటం కూడా విశేషం.

## హిండెన్‌బర్గ్ ఆరోపణలపై రాహుల్ గాంధీ స్పందన

అని రాహుల్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ, భారత స్టాక్ మార్కెట్‌లో సరిగ్గా ఇదే జరుగుతోంది, గత కొన్నేళ్లుగా, భారతదేశ స్టాక్ మార్కెట్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు పెట్టుబడులు పెడుతున్నారు, వారు కష్టపడి సంపాదించిన, నిజాయితీగా సంపాదించిన పెట్టుబడిని పెడుతున్నారు. స్టాక్ మార్కెట్‌లో పొదుపులు "భారత స్టాక్ మార్కెట్‌లో గణనీయమైన ప్రమాదం ఉందని మీ దృష్టికి తీసుకురావడం ప్రతిపక్ష నాయకుడిగా (లోక్‌సభలో) నా కర్తవ్యం ఎందుకంటే స్టాక్ మార్కెట్‌ను నియంత్రించే సంస్థ రాజీపడింది అని రాహుల్ ఆరోపించారు.ఇంత తీవ్రమైన ఆరోపణలు వచ్చినా సెబీ చీఫ్ ఎందుకు రాజీనామా చేయలేదని ప్రతిపక్ష నేత రాహుల్ ప్రశ్నించారు. ఆయన తన పదవి నుంచి వైదొలిగి తనపై వచ్చిన ఆరోపణలపై న్యాయమైన విచారణకు సహకరించాలని అన్నారు. కొత్త తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ అంశాన్ని సుప్రీంకోర్టు మరోసారి సుమోటోగాపరిశీలిస్తుందా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో జేపీసీ విచారణకు ప్రధానికి ఎందుకు భయపడుతున్నారో అర్థమైందని రాహుల్ చెప్పుకొచ్చారు.

### తీవ్రంగా స్పందించిన సెబీ ఛైర్ పర్సన్

హిండెన్ బర్గ్ ఆరోపణలను మాధవీ పురి ఖండించారు. ఆ సంస్థ తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఆర్థిక రికార్డులను బహిర్గతం చేస్తామని చెప్పారు. తాము ప్రైవేటు వ్యక్తులుగా ఉన్న రోజుల్లో ఆర్థిక కార్యకలాపాల వివరాలను కూడా అధికారులకు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. మరోవైపు, అదానీ గ్రూప్ కూడా ఈ ఆరోపణలను కుట్రపూరితమేనంటూ కొట్టిపారేసింది. వ్యక్తిగత లాభం కోసం సమాచారాన్ని వక్రీకరిస్తూ మదుపరులను తప్పుదోవపట్టించేందుకు యత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది.

### హిండెన్‌బర్గ్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలు: బీజేపీ

సెబీ ఛైర్ పర్సన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన తాజా నివేదికను రాజకీయ నాయకులు, ఆర్థిక నిపుణులు తోసిపుచ్చుతున్నారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థను అస్థిరపరిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నం జరుగుతోందని మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఆరోపించారు. ఇది సెబీపై దాడిగా అభివర్ణించారు.అంతేగాక, హిండెన్‌బర్గ్‌తో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలున్నాయని సంచలన ఆరోపణలు చేశారు రాజీవ్ చంద్రశేఖర్. విదేశీ బ్యాంక్ హిండెన్‌బర్గ్ ద్వారా సెబీపై జరిగిన దాడిలో కాంగ్రెస్ తో స్పష్టమైన భాగస్వామ్యం కలిగివుంది. ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థలో ఒకదానిని అస్థిరపర్చడం, కించపర్చడం, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాన్ని గందరగోళపర్చడమే వారి లక్ష్యం అని రాజీవ్ చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. కాగా, ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీ సుబ్రమణియన్ కూడా సెబీ చీఫ్ చిత్తశుద్ధిని సమర్థించారు.

## సీనియర్ నేతలంతా ఎవరికి వారే యమునా తీరే

ఢిల్లీలో ఉంటున్నారు. రాష్ట్రంలో పార్టీ వ్యవహారాలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఎమ్మెల్యేలు, పార్టీ యంత్రాంగం మధ్య సమన్వయానికి రాష్ట్ర పార్టీలో ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగా చిన్న చిన్న విషయాలు సైతం ఆగాధానికి కారణమవుతున్నాయంటున్నారు. పార్టీ కార్యాలయంలో జరిగే కార్యక్రమాలకు కూడా ఎమ్మెల్యేలకు సమాచారం ఉండటం లేదు. ఆ మధ్య జరిగిన కిసాన్ హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభానికి ఒక్క ఎమ్మెల్యే కూడా హాజరుకాలేదు. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా ఆవిర్భవించాలని కోరుకుంటున్న కమలదళంలో ఈ గందరగోళం కార్యకర్తలను ఆవేదనకు గురిచేస్తోందంటున్నారు. పార్టీలో సమన్వయం లోపిస్తే పార్టీని బలోపేతం చేయడం ఎలా అని క్యాడర్ కంగారు పడుతున్నారు.

### కొత్త అధ్యక్షుడి ఎంపికపై తేలని చర్చలు

కేంద్ర మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసిన రోజునే తెలంగాణ కొత్త చీఫ్ గా ఈటల రాజేందర్ ను నియమిస్తారన్న చర్చ జరిగింది. కానీ ఇప్పటి వరకూ ప్రకటన రాలేదు. రెండు, మూడు సార్లు రాష్ట్రానికి బీఎల్ సంతోష్ వచ్చి అందరితో మాట్లాడి వెళ్లారు కానీ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. కొత్త అధ్యక్ష నియామకం జరిగితేనే తెరపడుతుందనేది అంతర్గతంగా బీజేపీలో జరుగుతున్న చర్చ. కానీ అలా నియమిస్తే సమస్యలు ఇంకా పెరిగిపోతాయేమోనని హైకమాండ్ భయపడుతోంది.

## ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్య రోడ్లు

రానున్నాయి.ఇప్పటికే హైదరాబాద్ శివారు ముచ్చింతల్‌లో మరో నగరాన్ని నిర్మిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. హైదరాబాద్, సైబరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు ధీటుగా ఈ నగరం ఉంటుందన్నారు. ఇప్పుడు ఆర్ఆర్ఆర్ నిర్మాణం పూర్తి చేసి రేడియల్ రోడ్లు నిర్మిస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందనుంది.

## సీతారామ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్

ఎకరాలకు నీరు అందించనున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. గోదావరి జలాలతో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆగస్టు 15న ప్రాజెక్టు 2, 3 లిఫ్ట్ ఇరిగేషన్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి ఆయకట్టులోని ప్రతి ఎకరానికి నీరందిస్తామని చెప్పారు. ఇటీవల చెప్పినట్లుగానే అదేరోజు సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. రీడిజైన్ పేరుతో బీఆర్ఎస్ హయాంలో రూ.8 వేల కోట్లు వృథా చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రెండు దఫాలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా, సీతారామ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు వరకు గోదావరి జలాలు వస్తాయన్నారు. పంప్ హౌస్‌ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువలు త్వరగా పూర్తి చేస్తామన్నారు. మొదటి పంపు హౌజ్ ట్రయల్ రన్‌ను గత జూన్‌లో విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. రెండో పంపు హౌజ్ ట్రయల్ రన్‌ను జులై 2న విజయవంతంగా నిర్వహించినట్టు వెల్లడించారు. రైతుల కష్టాలు ఇకపై తొలగిపోయాతాయని అన్నదాతల కళ్లల్లో ఆనందాన్ని చూడడమే తమ లక్ష్యమన్నారు.రాజీవ్ నగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, ఇందిరా సాగర్‌లను ఒకే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌గా విలీనం చేసి భద్రాద్రి సీతారాముడి పేరు మీదుగా సీతారామ ఎత్తిపోతల పథకంగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ ప్రాజెక్టును స్వాతంత్ర దినోత్సవం రోజున సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. గోల్కొండ కోటలో జెండా ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నాక హెలికాప్టర్ ద్వారా ఖమ్మం జిల్లా వైరాకు రేవంత్ రెడ్డి చేరుకుంటారు. సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్‌లను స్విచ్చాన్ చేసి ప్రారంభిస్తారు. అనంతరం వైరాలో జరగనున్న బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు.

## కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యామ్ గేటు

ఈ ఒక్క గేటు విరిగి కొట్టుకుపోవడంతో తుంగభద్ర డ్యామ్ నుంచి 60 టీఎంసీల నీరు వృథాగా పోనుందని తెలిపారు. మరోవైపు షిమోగలో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో నీరు దిగువకు వరదలాగా ప్రవహిస్తుండటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. నదీపరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు. వరద నేపథ్యంలో సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే తుంగభద్ర నుంచి సుంకేసుల ప్రాజెక్టుకు ఏకంగా లక్ష క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఇక్కడ కూడా అధికారులు అలర్ట్ అయ్యారు. తుంగభద్ర గేటు మరమ్మతులు పూర్తి చేసే వరకు సుంకేసుల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగనుందని అధికారులు వెల్లడించారు. వరద ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు అడ్డంకిగా మారిందని చెప్పారు. తుంగభద్రలో వరద తగ్గాక అధికారులు మరమ్మతులు చేపట్టి విరిగిపోయిన గేటు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయనున్నారు. అయితే ఎగువ నుంచి వరద తగ్గడంతో డ్యాం గేట్లను మూసివేసే సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నుంచి 60 టీఎంసీల నీళ్లు బయటికి వదిలిన తర్వాతే గేటు పునరుద్ధరణ పనులు చేపడతామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం 33 గేట్లు తెరిచి నీటిని కిందికి వదులుతున్నట్లు వివరించారు. డ్యామ్ భద్రతకు సంబంధించి ఇంత పెద్ద ఘటన జరగడం గత 70 ఏళ్లలో ఇదే మొదటిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాలం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు కర్ణాటకలో తుంగభద్ర డ్యామ్ గేటు విరిగిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఘటనకు సంబంధించిన వివరాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అలర్ట్ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. డ్యామ్‌లో 6 మీటర్ల ఎత్తు వరకు నీరు ఉందని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. స్టాప్‌లాక్ అరేంజ్‌మెంట్ ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరోవైపు తుంగభద్ర డ్యామ్ అధికారులతో మాట్లాడి తాత్కాలిక గేటు ఏర్పాటు చేసేలా చూడాలని మంత్రి పయ్యావుల కేశవ్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. అయితే డ్యామ్ పాత డిజైన్ కావడం వల్ల స్టాప్‌లాక్ గేట్ ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని మంత్రి పయ్యావుల సీఎంకు వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఘటనాస్థలికి ఇంజినీర్ల బృందం, సెంట్రల్ డిజైన్ కమిషనర్ వెళ్లినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కౌతాలం, కోస్గి, మంత్రాలయం, నందవరం ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల ప్రాజెక్టుల అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

## హైదరాబాద్‌లో మోనార్క్ ట్రాక్టర్స్ విస్తరణ

బాగమై రాష్ట్రంలో తమ ఉనికిని విస్తరించుకోవాలని తాము ఆశిస్తున్నట్లు ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలో తమ కార్యకలాపాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఇతర అధికారులను కలవడం ఎంతో సంతోషం కలిగించిదని మోనార్క్ ట్రాక్టర్ సీఈవో ప్రవీణ్ పెన్మెత్స వెల్లడించారు. హైదరాబాద్‌లోని తమ కేంద్రం అధునాతన డ్రైవర్-ఆప్షన్ స్మార్ట్ ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌లను రూపొందించడంలో కీలకపాత్ర పోషించిందని ప్రవీణ్ పెన్మెత్స తెలిపారు.

## బీజేపీకి ఆంధ్రా తీపి, తెలంగాణ చేదు అయిందా.?

సిద్దిపేటలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ తెలంగాణను దారుణంగా మోసం చేశాయన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అబద్దాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలకు చెరో 8 ఎంపీ సీట్లను ఇస్తే తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళలకు రూ.2500, పెన్షన్ పెంపు వంటి హామీలను నెరవేర్చలేదన్నారు. బెల్ట్ దుకాణాలను బంద్ చేస్తానన్న కాంగ్రెస్ ఇప్పుడు మల్లీ గల్లీకో బెల్ట్ దుకాణం తెరిచిందన్నారు. మద్యం విషయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విమర్శలు చేసిన కాంగ్రెస్ ఇప్పుడేం చేస్తుందని నిలదీశారు. మద్యంపై బడ్జెట్‌లో గత ఏడాది కంటే ఈసారి రూ.7,300 కోట్లు ఎక్కువగా పెంచారన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీ ఎక్కడకు పోయిందో చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలిపోతే కాళేశ్వరం ప్రాజెక్టే కూలిపోయినట్లుగా ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కూలిపోతే రంగనాయకసాగర్‌లోకి నీళ్లు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు.

## చంద్రబాబు ఒకటే పథకం

సేవలో పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించబోతున్నారు. ప్రతి నెలా ఒకటోతేదీన ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రజలవద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుంటారు. సాధ్యమైనంతవరకు కొన్నింటిని అక్కడికక్కడే అధికారులద్వారా పరిష్కరింపచేస్తారు. తర్వాత తాను ఎన్నికల హామీలో ఇచ్చిన ఉద్యోగాల కల్పనను సాధ్యమైనంత వేగంగా అమలు చేయాలన్న ఉద్దేశంలో చంద్రబాబు ఉన్నారు.స్కిల్ డెవలప్ మెంట్ అంశాన్ని కలెక్టర్ల సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించి యువతకు ఉద్యోగాలను ఇచ్చేదిశగా అడుగులు వేయబోతున్నారు. 2047కల్లా దేశంలో పెరుగుతున్న వృద్ధ జనాభాను దృష్టిలో ఉంచుకొని వారికి అనుగుణంగా కొత్త పథకాలను, వారి అవసరాలను తీర్చేలా ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.

### త్వరలోనే ఆకస్మిక తనిఖీలు

ప్రతి జిల్లాల్లో విండ్ టర్బైన్లు ఏర్పాటు చేయబోతున్నారు. అలాగే సోలార్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని సోలార్ విద్యుత్తుదిశగా అడుగులు వేయించబోతున్నారు. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయించి, వాటినుంచి విద్యుత్తును కొనుగోలు చేస్తారు. ప్రతిపక్షాలు చేసే ఆరోపణలపై కఠినంగా వ్యవహరించబోతున్నారు. చేసే ఆరోపణకు కచ్చితంగా సాక్ష్యాలుండాలి. గంజాయి విషయంలో ఉక్కుపాదం మోపుతున్నారు.పరిపాలనపై పూర్తిస్థాయిలో పట్టు ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులకు కలిపి ఓ యాప్ అందుబాటులోకి తెస్తున్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలోనే ఆకస్మిక తనిఖీలు చేయబోతున్నారు. దీనిద్వారా అధికారులు అప్రమత్తంగా ఉంటారనేది ఆయన ఉద్దేశంగా ఉంది. చెత్తను పొలాలకు ఎరువుగా ఉపయోగించే అంశంతోపాటు దాన్ని రీసైక్లింగ్ చేసి డబ్బులు సంపాదించేలా చూడబోతున్నారు. అధికారులు క్రియేటివ్ గా ఆలోచించి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని చంద్రబాబు కోరుతున్నారు.

## యాదగిరిగుట్ట కొండపైన పుష్కరిణి ప్రారంభోత్సవం

**స్వామి వారి అఖండ దీపం ప్రారంభోత్సవం**

**యాదగిరిగుట్ట కొండపైన పూర్వ వైభవం తీసుకొస్తాం-ఎమ్మెల్యే బీర్లఐలయ్య**



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట కొండపైన విష్ణు పుష్కరిణి,అఖండ దీపాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు.ముందుగా స్వామివారి వద్ద సంకల్పపూజ చేసి స్వామి వారి పుష్కరిణిలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అనిత దంపతులు సంకల్ప స్నానం చేశారు.ఆ తర్వాత స్వామి వారి అఖండ దీపంన్నీ ప్రారంభించారు.అనంతరం ఆలయంలో శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కి ఆశీర్వచనం చేశారు.ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం అందజేసారు.

## బస్సులో దేవుళ్ళ ఫోటోలు తొలిగించిన అధికారిపై చర్యలకు డిమాండ్



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో ఉన్నటువంటి ఆర్టీసీ డిపోలో బస్సులలో దేవుళ్ళ ఫోటోలు తొలగించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ యాదగిరిగుట్ట పట్టణ శాఖ తరపున వినతి పత్రం ఇవ్వడం జరిగింది. స్వామి వారి ఫోటోలు తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోకపోతే బిజెపి పార్టీ తరపున ఆర్టీసీ డిపో ముందు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట బిజెపి మండల శాఖ పట్టణ శాఖ బజరంగ్దళ్ విశ్వవిందు పరిషత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలపై అవగాహన లేని బండికి ఎమ్మెల్యే కృష్ణారావును విమర్శించే అర్హత లేదు

**- ప్రధాన కార్యదర్శి బాలాజీ నగర్ వెల్డి వెంకటేష్ చౌదరి**



కూకట్ పల్లి (ప్రశ్న న్యూస్) కూకట్ పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అధికారులను బెదిరించే సంస్కృతి లేదని, పనిచేసే అధికారులకు మద్దతుగా నిలిచి పనిచేపించడమే తెలుసని బీఆర్ఎస్ పార్టీ బాలాజీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెల్డి వెంకటేష్ చౌదరి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిధులను కేటాయించి పనులను ప్రారంభించినప్పటికీ పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడాన్ని సమర్థిస్తూ మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజాసమస్యలపై ఏ మాత్రం అవగాహన లేదనే విషయం అవగతం అవుతుందన్నారు. ప్రజల మద్దతుతో మూడవ సారి అత్యధిక మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురించి ఆయన పనితీరు గురించి ప్రజలకు తెలుసునని, ఓటమి పాలైనా బండి రమేష్ కు కూకట్ పల్లి ప్రజల సమస్యలపై ఏమాత్రం లేదన్నారు. శేరిలింగంపల్లి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు ముట్టచెప్పి కూకట్ పల్లిలో పోటీచేసి ఓటమి పాలైయాడని, అప్పటి నుంచి ఏమీ చేయాలో పాలుపోక కూకట్ పల్లిలో అనేక ఏళ్లుగా కాంగ్రెస్ లో ఉన్న నాయకులపై పెత్తనం చెలాయిస్తూ అటు నాయకులను ఇటు అధికారులను బెదిరిస్తున్న బండి రమేష్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఇతరులకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోవడం, అదేవిధంగా అసంపూర్తిగా మిగిలిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పై ఆరోపణలు అధికారులకు, ప్రజలకు, నాయకులకు అందరికీ తెలుసునని, కొత్తగా కూకట్ పల్లి లోకి వచ్చిన బండికే తెలియాల్సి ఉందని ఎద్దేవ చేశారు. మూసపేట మాజీ కార్పొరేటర్ గురించి మాట్లాడే బండి రమేష్ తాను కనీసం వార్డు మెంబర్ గా కూడా గెలువలేదనే విషయం మరిచిపోయా రని, వార్డు మెంబర్ కూడా కానీ బండి రమేష్ కు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అర్హత ఎక్కడని, ముందు నీ సంగతి చూసుకో కనీసం వార్డు మెంబర్ గా గెలిచి ఇతరులను విమర్శిస్తే కనీస విలువైన ఉంటుందన్నారు. తగుదునమ్మా అంటూ ఉదయాన్నే లేవగానే పార్టీ కండువా లేనిదే బయటకు రాలేని వారు ఎవరు గుర్తుకూడా పట్టలేని బండి రమేష్ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీ కండువాను వేసుకుని పాల్గొనడం సిగ్గనే విషయాన్ని గుర్తిస్తే మంచిదని సూచించారు

## కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేసే అధికారులపై స్థానిక ఎమ్మెల్యే ఓర్వలేక అక్కసుతో బదనాం చేసే ప్రయత్నం

**- కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**



కూకట్ పల్లి( ప్రశ్న న్యూస్) కూకట్‌పల్లి నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ ఎమ్మెల్యే కృష్ణారావు స్పీకర్ ను కలవడం రాజకీయ జిమ్మిక్కు అంటూ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఖండించారు. ఎమ్మెల్యే కృష్ణారావు వ్యవహార శైలి అధికారులను బెదిరించే విధంగా ఉందని ఆదివారం రమేష్ ఓ ప్రకటనలో విడుదల చేశారు. అతనికి తన మాట వినని వారందరినీ బెదిరించే అలవాటు ఎప్పటినుంచో ఉందని రమేష్ ధ్వజమెత్తారు. ప్రోటోకాల్ పేరుతో అధికారులపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతోనే ఇలాంటి డ్రామాలకు తెరలేపాడన్నారు. 10 సంవత్సరాలు అధికార పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న అతను ఎన్నికల ముందు నియోజకవర్గంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్న కృష్ణారావు ఇప్పుడు మాత్రం అధికారులు పనిచేయడం లేదంటూ విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీని అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతోనే కృష్ణారావు ఇలాంటి చీప్ ట్రిక్స్ కు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. ప్రోటోకాల్ అంటూ యాగిచేసే కృష్ణారావు మూసాపేట్ లో గెలిచిన కార్పొరేటర్ ను పక్కనపెట్టి ఓడిన కార్పొరేటర్ ను వెంటేసుకుని తిరగడం ఏ ప్రోటోకాల్ కిందకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే ఇలా అధికారులను బెదిరించే ధోరణికి దిగుతున్నాడన్నారు. అధికారులు ఇలాంటి బెదిరింపులకు భయపడే అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజాయితీగా పనిచేసే అధికారులకు ఎప్పటికీ అండగా ఉంటుందని రమేష్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ 10 కోట్లు కేటాయించగా ఆ పనులు కొనసాగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి పచ్చదనం కోసం ఇటీవల మరో రూ 10 కోట్ల కేటాయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో త్వరలోనే ఆయా పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరు అక్రమ వసూళ్లకు పాల్పడినా వారిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని బండి రమేష్ హెచ్చరించారు.

## యాదాద్రి గిరిప్రదక్షణకు పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు




యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదాద్రి భువనగిరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువైన కొండ చుట్టూ గిరిప్రదక్షిణలో ఆదివారం స్వాతి తిరు నక్షత్రం పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలలతో పాటు



ఆలేరు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ముందుగా పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, జై భోలో లక్ష్మీనరసింహస్వామి అంటూ,భజనలు చేస్తూ,యధా ఋషి వద్ద నమస్కరించి ఈ గిరిప్రదక్షిణ పాల్గొన్నారు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్వాతి నక్షత్రం సందర్భంగా కుటుంబ సమేతంగా సామూహిక గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

# 'మురారి' రీ రిలీజ్..

## ఆల్ టైమ్ రికార్డ్ క్రియేట్ చేసిన మహేశ్ బాబు



ప్రిన్స్ మహేశ్ బాబు మురారి రీ రిలీజ్ ఆల్ టైమ్ రికార్డ్ క్రియేట్ చేసింది. ఆగష్టు 09న సూపర్ స్టార్ మహేశ్ బాబు బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను రీ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. చాలా రోజులకు మహేశ్ మూవీ రీ రిలీజ్ అవ్వడంతో థియేటర్లంతా హౌస్‌ఫుల్ షోలతో రన్ అయ్యింది. అయితే తాజాగా ఈ చిత్రం రీ రిలీజ్‌లో కూడా రికార్డు కలెక్షన్స్ సాధించింది. ఓవర్సీస్‌లో దూమ్ములేపినట్లు తెలుస్తుంది. అమెరికాలో రీ రిలీజ్ చేసిన సినిమాల్లో అత్యధిక కలెక్షన్లు సాధించిన మూడో చిత్రంగా మురారి నిలిచింది. ఎన్టీఆర్ నటించిన సింహాద్రి చిత్రం మొదటి స్థానంలో ఉంది. ఇక మురారి రీ రిలీజ్ కలెక్షన్లు చూసుకుంటే ప్రపంచవ్యాప్తంగా రూ. 5.5 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఓవరాల్‌గా చూసుకుంటే రీ రిలీజ్ కలెక్షన్స్‌లో ఖుషి టాప్ ప్లేస్‌లో ఉండగా.. బిజినెస్‌మాన్ రెండో స్థానంలో ఉంది. మురారి టాప్ 3లో నిలిచింది. మహేశ్ కెరీర్‌లో గుర్తుండిపోయే బ్లాక్ బస్టర్ చిత్రాలలో ఒకటి మురారి టాలీవుడ్ క్లాసికల్ దర్శకుడు కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో మహేశ్, సోనాలి బింద్రే హీరో హీరోయిన్‌లుగా నటించారు. 2001లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా టాలీవుడ్ నుంచి వచ్చిన ఆల్ టైం క్లాసిక్‌లలో ఒకటిగా నిలిచింది.

# మాకు ఎంగేజ్‌మెంట్ అయిన 9 ఏండ్ల తర్వాత పెళ్లి చేసుకున్నాం: తాప్సీ



బాలీవుడ్ నటి తాప్సీ పన్ను రీసెంట్‌గా పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. డెన్మార్క్‌కు చెందిన మతియాస్ బో అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. అయితే పెళ్లి అనంతరం తన భర్త గురించి కానీ.. తన గురించి కానీ ఎక్కడ న్యూస్ రాలేదు. తాప్సీ కూడా అతడితో ఉన్న ఫొటోలను పోస్ట్ చేయలేదు. అయితే తన తాజా చిత్రం ఫిర్ ఆయీ హసీన్ దిల్రుబా నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఆగష్టు 09న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రీసెంట్‌గా ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తన రిలేషన్‌షిప్ గురించి అడుగగా.. తాప్సీ సమాధానమిస్తూ సంచలన వ్యాఖ్యలు చేసింది.తాప్సీ ఈ ఏడాది మార్చి 23న పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే తన ఎంగేజ్‌మెంట్ మాత్రం 9 ఏళ్ల క్రితమే అయినట్లు ప్రకటించింది. మతియాస్ బోను నేను 11 ఏళ్ల ముందు కలిశాను. 1 ఇయర్ వరకు డేటింగ్‌లో ఉన్న తర్వాత మతియాస్ నాకు ప్రపోజ్ చేశాడు. అప్పుడే మేము ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం అయితే ఇన్ని సంవత్సరాలు మేము విడిపోకుండా ఉన్నామంటే అది ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ వల్లనే. అయితే మా ఫస్ట్ డేట్‌కి దుబాయ్ వెళ్లామని చెప్పుకోచ్చింది.ఇక తాప్సీ భర్త విషయానికి వస్తే.. మథియాస్ బో డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. ఇతడు 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో రజతం సాధించాడు. అలాగే 2015 యూరోపియన్ గేమ్స్‌లో బంగారు పతక విజేత, 2012 మరియు 2017లో రెండుసార్లు యూరోపియన్ ఛాంపియన్‌గా నిలిచాడు.


# బ్యాడ్మింటన్ ప్లేయర్‌తో ప్రేమలో పడిన ఆర్జీవీ మేనకోడలు



టాలీవుడ్ వివాదాస్పద దర్శకుడు రాం గోపాల్ వర్మ మేనకోడలు పెళ్లి పీటలు ఎక్కబోతుంది. వర్మ మేనకోడలు సినీ నిర్మాత ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ శ్రావ్య వర్మ, బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ ఒక్కటికానున్నారు. తాము శనివారం ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు శ్రావ్య సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై కిదాంబి శ్రీకాంత్ ఇన్‌స్టా వేదికగా వెల్లడిస్తూ.. శ్రావ్య నాకు ఓకే చెప్పింది. మేమిద్దరం కలిసి ఒక అంతులేని కథను రాసేందుకు సిద్ధమవుతున్నాం అంటూ రాసుకోచ్చాడు. శ్రావ్య వర్మ టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండతో పాటు అక్కినేని నాగార్జున, పంజా వైష్ణవ్ తేజ్, విక్రమ్ తదితర హీరోలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహారించింది. ఇక శ్రావ్య వర్మ తన మేనకోడలని రామ్ గోపాల్ వర్మ లక్ష్మీస్ ఎన్టీఆర్ అనే సినిమా ఈవెంట్‌లో పరిచయం చేశాడు.

# సమంతకు ప్రపోజ్ చేసిన అభిమాని.. ఓకే చెప్పిన హీరోయిన్!





టాలీవుడ్ నటి సమంత ఒక యువకుడికి ఓకే చెప్పింది. తనను ఇన్‌స్టాలో ప్రపోజ్ చేసిన యువకుడితో బాగుంది కన్వీన్స్ అయ్యానంటూ చెప్పుకోచ్చింది. సమంత మాజీ భర్త హీరో నాగ చైతన్య రెండో పెళ్లి చేసుకుంటున్న విషయం తెలిసిందే. తెలుగు నటి శోభిత ధూళిపాళ్లను అతడు త్వరలో వివాహం చేసుకోనున్నాడు. అయితే రీసెంట్‌గా వీరిద్దరి ఏంగేజ్‌మెంట్ గ్రాండ్‌గా జరిగింది. అయితే నాగ చైతన్య రెండో పెళ్లి చేసుకుంటున్నాడు అని ప్రకటించిన అనంతరం సమంత మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఈ క్రమంలోనే సమంతకు ఓ అభిమాని చేసిన ప్రపోజల్ చేయగా.. ఆ అభిమానికి ఫన్నీగా ఓకే చెప్పింది సామ్. సమంత మీద తనకున్న ప్రేమను ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియా వేదికగా తెలుపుతూ.. ఒక వీడియో క్రియేట్ చేశాడు. ఈ వీడియోలో.. సామ్ నువ్వు బాధ పడాల్సిన అవసరం అస్సలు లేదు. నీకోసం నేను ఎప్పుడూ ఉంటాను. నువ్వు నేను కలిస్తే ఒక మంచి జంట అవుతుంది. నువ్వు ఓకే అంటే పెళ్లి చేసుకోవడానికి రెడీగా ఉన్నాను. నాకోక 2 ఇయర్స్ టైం ఇవ్వు డబ్బులు సంపాదిందిచ నీ దగ్గరికి వస్తాను. అప్పటివరకు నా గుర్తుగా ఈ పువ్వు అదే హార్ట్‌ను ఉంచుకో. ప్లీజ్ మ్యారీ మీ, ప్లీజ్ మ్యారీ మీ సామ్ అంటూ ఒక వీడియోను పోస్ట్ చేశాడు. ఈ వీడియో చూసిన సమంత.. బ్యాక్‌గ్రౌండ్‌లో జిమ్ ఉంది. నేను ఆల్మోస్ట్ కన్విన్స్ అయ్యాను అంటూ అభిమానికి రిప్లయ్ ఇచ్చింది. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# వరుణ్ తేజ్ మట్కా కింగ్ వాసులుక్ అదిరింది.. !

టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి పీరియాడిక్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతోన్న మట్కా ఈ చిత్రానికి పలాస 1978 ఫేం కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా నుంచి అదిరిపోయే లుక్ షేర్ చేశారు. కమాండ్ చేసేందుకు, జయించేందుకు ఇక్కడ ఉన్నాడు.. మట్కా కింగ్ వాసును కలవండి.. అంటూ షేర్ చేసిన తాజా పోస్టర్‌లో వరుణ్ తేజ్ చేతిలో సిగరెట్ పట్టుకుని కనిపిస్తుండగా.. టేబుల్‌పై ఓ వైపు పిస్తోల్, మరోవైపు డబ్బు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రొడక్షన్ టీం 1980 బ్యాక్‌డ్రాప్ వైజాగ్ లొకేషన్స్‌ను రీక్రియేట్ చేసిన స్పెషల్ గ్లింప్స్ వీడియో షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన మట్కా టైటిల్ టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతూ సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. వరుణ్ తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించబోతున్నాడట.



# కల్కి 2898 ఏడీ మేకర్స్ తీరుతో చిరంజీవి అభిమానులు అప్‌సెట్..




టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ల్యాండ్ మార్క్ సినిమా ఇంద్ర . బి గోపాల్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించారు. చిన్ని కృష్ణ కథనందించిన ఈ చిత్రం 2002 జూలై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్లు వర్షం కురిపించింది. చిరంజీవి కెరీర్‌లోనే అప్పటివరకు ఉన్న కలెక్షన్ల మార్క్‌ను దాటేసిన చిత్రంగా ఇంద్ర నిలిచింది. ఈ సినిమా విడుదలై ఇటీవలే విజయవంతంగా 22 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు, మూవీ లవర్స్ కోసం చిరంజీవి బర్త్ డే కానుకగా ఆగష్టు 22న రీ రిలీజ్ చేయబోతున్నామని ప్రకటించారు. అయితే బర్త్ డే దగ్గర పడుతుండగా.. మరోవైపు మేకర్స్ నుంచి మాత్రం కొత్త వార్త ఏమీ రాకపోవడంతో అభిమానులు అప్‌సెట్‌లో ఉన్నారన్న వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇంద్ర రీరిలీజ్‌కు సంబంధించిన రెగ్యులర్ అప్‌డేట్స్ అందించాలని కల్కి 2898 ఏడీ మేకర్స్ అయిన వైజయంతీ మూవీస్‌ను విజ్ఞప్తి చేస్తున్నారు. రీరిలీజ్ ట్రెండ్స్‌లో సరికొత్త రికార్డులు నెలకొల్పేలా గ్రాండ్ ఈవెంట్ ప్లాన్ చేయాలంటూ కోరుతున్నారు. మరి వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ఫ్యాన్స్ కోసం ఏదైనా అప్‌డేట్ ఇస్తుందేమో చూడాలి. ఇంద్రలో సోనాలి బింద్రే, ఆర్తి అగర్వాల్ హీరోయిన్లుగా నటించారు. ప్రకాశ్ రాజ్, ముఖేశ్ రిషి, పునీత్ ఇస్సార్, తనికెళ్లభరణి, అల్లు రామలింగయ్య, బ్రహ్మానందం, ధర్మవరపు సుబ్రహ్మణ్యం ఇతర కీలక పాత్రల్లో నటించారు.

# హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ విస్తరణ



**అమెరికా (ప్రశ్నన్యూస్):** టెక్నాలజీ దిగ్గజం అమెజాన్ కంపెనీ హైదరాబాద్‌లో తన డేటా సెంటర్‌ను విస్తరించే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ప్రదర్శించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్ ప్లానింగ్ అండ్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, కంపెనీ ప్రతినిధి బృందంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. తెలంగాణలో డేటా సెంటర్ కార్యకలాపాలపై చర్చలు జరిపారు. ఇప్పటికే తెలంగాణలో అమెజాన్ కంపెనీ కార్యకలాపాలను విస్తరించింది. ప్రపంచంలోనే అమెజాన్ కంపెనీకి చెందిన అతిపెద్ద కార్పొరేట్ భవనం హైదరాబాద్‌లో ఉంది. గత ఏడాది అమెజాన్ డెడికేటేడ్ ఎయిర్ కార్గో నెట్‌వర్క్ 'అమెజాన్ ఎయిర్' ప్రారంభించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ కు సంబంధించి హైదారాబాద్‌లో మూడు డేటా సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ఆధారిత సేవలతో కొత్త హైపర్ స్కేల్ డేటా సెంటర్‌తో పాటు తమ వ్యాపారాన్నివిస్తరించే ఆలోచనలను ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అమెజాన్‌తో చర్చలు విజయవంతమయ్యాయని ప్రకటించారు. ప్రభుత్వం తరఫున తగినంత సహకారంతో పాటు ఉత్తమమైన ప్రోత్సాహకాలు అందిస్తామని వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో భారీ విస్తరణకు కంపెనీ ముందుకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాలినేని అభ్యర్థనకు ఈసీ ఒకే...

# ఒంగోలులో ఉత్కంఠ...

**ఒంగోలు (ప్రశ్నన్యూస్)** ఈవిఎంల పనితనంపై కొన్ని నెలలుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, నిపుణులు పలువిధాలుగా ఈ అంశంపై స్పందించారు...అంతర్జాతీయంగా కూడా ఈ అంశం చర్చకు దారితీసింది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని కొందరు క్లారిటీ ఇచ్చారు. అందుకే కొన్ని దేశాల్లో వాటిని బహిష్కరించినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల సమయంలో పోలింగ్ సందర్భంగా ఉపయోగించిన ఈవీఎంల పైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. వాటిని నివృత్తి చేయాని కోరుతూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఒంగోలు నియోజక వర్గంలో పోలింగ్ నాడు ఉపయోగించిన ఈవీఎంలను రీ వెరిఫికేషన్ చేయాలని ఆయన కోరారు...బాలినేని అభ్యర్థనకు ఈసీ ఓకే చెప్పింది. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు బాలినేని శ్రీనివాస్ రెడ్డి కోరిన విధంగా ఈవీఎంల పునః పరిశీలన చేయనున్నారు. ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి 12 పోలింగ్ కేంద్రాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన బాలినేని అక్కడ ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని అనుమానం వ్యక్తం చేస్తూ రీ వెరిఫికేషన్ చేయాలని 5, 66,400 రూపాయలు జూన్ 10వ తేదీన చెల్లించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు బెల్ ఇంజనీర్లతో డమ్మీ బ్యాలెట్లు ఏర్పాటు చేసి బాలినేని శ్రీనివాస్ రెడ్డి కోరిన విధంగా 12 పోలింగ్ బూత్‌లలో రీ వెరిఫికేషన్ చేయించనున్నారు. తనకు పూర్తిగా మెజారిటీ వస్తుందని భావించిన పోలింగ్ బూతులలో తక్కువ ఓట్లు రావడంతో బాలినేనికి అనుమానం వచ్చింది. ఇక ఈ రీ వెరిఫికేషన్ కోసం అచ్చం ఓటర్లతో ఓట్లు వేయించిన ప్రాసెస్ ను డమ్మీగా చేయిస్తారు. ఆ పోలింగ్ బూత్ లలో ఓటర్లతో రీ వెరిఫికేషన్ పోలింగ్ ఆయా పోలింగ్ బూత్ లో వాడిన ఈవీఎంలను వివి ప్యాట్లను తెప్పించి సాధారణ పోలింగ్ మాదిరిగానే ఓటర్ల చేత ఓట్లు వేయిస్తారు. అభ్యర్థుల సమక్షంలోనే ఇలా చేస్తారు. ఓటు వేశాక అదే గుర్తుపైన నమోదవుతుందా లేదా వేరే పార్టీ గుర్తుపై నమోదవుతుందా అనేది అక్కడే పరిశీలిస్తారు. ఇక ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నారు. బెల్ కంపెనీకి చెందిన నిపుణుల సమక్షంలో ఈ ప్రక్రియ జరుగుతుందని 19వ తేదీ నుంచి రోజుకు రెండు బూత్ లలో ఓటర్లతో ఓట్లు వేయించి రీ వెరిఫికేషన్ పోలింగ్ చేస్తారని చెబుతున్నారు. మొత్తం 12 బూత్ లలో రీ వెరిఫికేషన్ జరుగనుంది.దీంతో ఒంగోలు వ్యాప్తంగా ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ ప్రక్రియతో ఈవీఎంలపై ఉన్న అనుమానాలుఏ తొలగిపోతాయని ఈసీ అంటుండగా హ్యాకింగ్ విషయంపై క్లారిటీ వస్తుందని వైసీపీ నేతలు చెప్తున్నారు. ఒకవేళ ఈవీఎంలు హ్యాకింగ్‌కు గురయ్యాయని తేలితే ఏపీలో ఎన్‌డిఏ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయి. ఈవిఎంలపై రాష్ట్రమంతటా రీవెరిఫికేషన్ చేయాలనే డిమాండ్ పెరుగుతుంది. అదే జరిగితే మధ్యంతర ఎన్నికలు రావొచ్చనే అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు విశ్లేషకులు.



## ఏపీలో కొత్త జంటలకు

# శుభవార్త




**అమరావతి (ప్రశ్నన్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెళ్లయిన జంటలకు అదిరిపోయే శుభవార్త చెప్పింది. కొత్త రేషన్ కార్డుల విషయంలో కొత్త జంటలకు తీపి కబురు అందించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన విధివిధానాలను రూపొందించడం మాత్రమే కాకుండా రేషన్ కార్డుల రంగులు కూడా మార్చనుంది. ఏపీలో త్వరలో అందరికీ పాత కార్డులు మార్చి కొత్త కార్డులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది ఏపీ సర్కార్. ఏపీలో ఉన్న రేషన్ కార్డులు ఇలా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోటి 48 లక్షల 43 వేల 671 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 89 లక్షల రేషన్ కార్డులకు ఆహార భద్రత చట్టం కింద కేంద్ర ప్రభుత్వం నిత్యవసర సరుకులను అందిస్తోంది. మిగిలిన 59,43,671 కార్డులకు రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చులను భరిస్తోంది. ఈ రేషన్ కార్డులకు కూడా కేంద్రం రేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.నూతన జంటలకు రేషన్ కార్డులు ఇలా ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా పెళ్లి అయిన జంటలు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే వారికి కొత్త కార్డులు జారీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పెళ్లయ్యి తల్లిదండ్రుల కార్డులో పేర్లు ఉన్నవారు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వారికి పెళ్లి జరిగిందని వివాహ ధ్రువపత్రాన్ని సమర్పించి రేషన్ కార్డును పొందవచ్చని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. నవ దంపతులకు శుభవార్త చెప్పిన మంత్రి నాదెండ్ల దీంతో పెళ్లి చేసుకున్నట్టు వివాహ సర్టిఫికెట్ ఉంటే చాలు.. వారికి రేషన్ కార్డు ఇవ్వనున్నారు. నవ దంపతులు కుటుంబాల నుంచి వేరుపడిన తర్వాత పెళ్లి సర్టిఫికెట్ సమర్పిస్తే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. నూతనంగా పెళ్లి చేసుకున్న వారు రేషన్ కార్డుల కోసం ఇబ్బంది పడుతున్నట్టుగా గుర్తించామని, ఈ క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.

## కరోనా మళ్లీ

# కోరలు చాస్తుందా?



**న్యూఢిల్లీ (ప్రశ్నన్యూస్):** కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తుంది. కొన్ని దేశాల్లో వైరస్ కోరలు చాస్తుంది. ఎక్కువ శాతం కరోనా వైరస్ బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ప్రధానంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఈ కరోనా వైరస్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని డబ్ల్యూహెచ్ఓ తెలపింది. ప్రపంచంలో అన్ని దేశాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. ఏ మాత్రం అలక్ష్యం చేసినా అందుకు భారీ మూల్యం చెల్లించక తప్పదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. 84 దేశాల్లో ఇప్పటికే ప్రపంచంలోని 84 దేశాల్లో కరోనా వైరస్ వ్యాపించిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారికంగా వెల్లడించింది. దీంతో అనేక దేశాల్లో ఇప్పటికే కరోనా విషయలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొన్ని దేశాల్లో మాస్క్‌లను కంపల్సరీ చేశారు. భౌతిక దూరం పాటించాలని ఆదేశాలు అందాయి. క్వారంటైన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు. ఆసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేసుకునేందుకు కొన్ని దేశాలు ఇప్పటికే సిద్ధమయినట్లు వార్తలు అందుతున్నాయి. పద్దెనిమిది నెలలుగా... గత పద్దెనిమిది నెలలుగా కరోనా వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొత్త వైరస్ కారణంగా అనేక మంది వైరస్ తో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. శ్వాసలో ఇబ్బందులు, జలుబు, దగ్గు, వాసన కోల్పోవడం వంటి లక్షణాలు కూడా కొన్ని చోట్ల ఉంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. పారిస్ ఒలింపిక్స్ లో కూడా కొందరు క్రీడాకారులకు కరోనా వైరస్ సోకడంతో వారిని క్వారంటైన్ సెంటర్లకు పంపారు. చికిత్స అందిస్తున్నారు. అందుకే ప్రపంచ దేశాలు మరోసారి కరోనా మహమ్మారి నుంచి బయటపడటానికి అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేసింది.

# యాదగిరిగుట్ట మండలంలో భారీ భూ స్కాం

## - కోర్టు ఆదేశాలను లెక్కచేయని కబ్జాదారులు

- కోర్టులో కేసు ఉండగానే భూమిని చదును చేస్తున్న వైనం
- పోలీసులంటే భయం లేదు, చట్టం అంటే లెక్కలేదు
- ఈ కబ్జాదారులకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధి ఎవరు.?
- నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన పట్టించుకోని వైనం
- కబ్జాదారులకు పూర్తిగా సహకరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు



**యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్)** యాదగిరి గుట్ట మండలంలో గల మల్లాపురం గ్రామం పెద్ద గ్రామ పంచాయతీ గ్రామంలో సర్వే నెంబర్ 424 లో భారీ స్కాం బయటపడింది. 424 సర్వే నెంబర్ లో గల 275 ఎకరాల భూమికి 1965 సంవత్సరంలో చింటకుంట్ల కొండల్ రెడ్డి అప్పటి భూ యజమాని అబూ సయ్యేద్ సాహెబ్ పి. టీ దారుడుగా ఉన్నాడు. అదే సంవత్సరంలో కొంత డబ్బులు అప్పుగా అబు సయ్యేదు కొండల్ రెడ్డి వద్ద తీసుకొని దానికి గాను తనకున్న 275 ఎకరాల భూమిలో 240 ఎకరాల భూమిని కండీషనల్ మార్టిగేజ్ చేశారు. అనగా రెండు సంవత్సరాల కాలంలో తీర్చలేని యెడల నీవే యజమాని అని, దానిపై నా వారసులకు ఎటువంటి హక్కు ఉండదని రిజిస్టర్ సేల్ డీడ్ అగ్రిమెంట్ చేసుకున్నారు. దానిని అమ్ముకోవచ్చు అనే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇట్టి భూమిని రక్షిత కౌలుదారు అయిన కొండల్ రెడ్డి పట్టాదారు గా అయ్యారు. సుమారు 50 సంవత్సరాలు గా భూమి మీద కబ్జా లో ఉన్నారు.తదనంతరం వారి కుమారులు హక్కు దారులుగా ఉన్నారు. దీనిని 2013 సంవత్సరంలో చింతకుంట్ల వారసులు నల్లబోలు ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి 198 ఎకరాలు అమ్మడం జరిగిందీ. కానీ నల్లబోలు ఇండస్ట్రీస్ వారికి మూటేషన్ అవ్వడం ఆలస్యం అవుతుండడంతో వారు హైకోర్టు ను ఆశ్రయించారు. అట్టి కేసు కోర్టులో ఉండగానే మాజీ సర్పంచ్ కర్రె వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ భర్త కర్రె వీరయ్య, పి.ఉపేందర్ రెడ్డి, ఎండి ఖలీల్ అధికారులతో కుమ్మక్కై దానికి అనర్హులైన వారసులను,నకిలీ కాగితాలు సృష్టించి వారి పేరు మీద దాదాపు 56 ఎకరాల భూమిని అక్రమంగా డబుల్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇట్టి అక్రమ రిజిస్ట్రేషన్ మీద కూడా నల్లబోలు ఇండస్ట్రీస్ వారు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు నుండి స్టే తెచ్చుకున్నారు. కానీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తులు మాత్రం అక్రమంగా భూమి మీదకి వచ్చి చదును చేస్తున్నారు. ప్రశ్నించగా మాదే భూమి అని బెదిరింపులకు పాల్పడుతున్నారు మమ్మల్ని భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇట్టి విషయాలపై డయల్ 100 కి,పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా కోర్టుల్లో కేసులు ఉన్నా కూడా వారు ఆగడం లేదు. కంపెనీ కోసం పొల్యూషన్ కంట్రోల్ కోసం కాపాడుతున్న చెట్లను కూడా నరికి వేస్తున్నారని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారికి సైతం పర్యావరణాన్ని రక్షించాలి అని చెప్పిన కూడా పట్టించుకోవడం లేదు. ఇట్టి స్కాం పాల్గొన్న అధికారులను కూడా కోర్టు ద్వారా శిక్షించాలని కంపెనీ యజమాని అయిన నల్లబోలు ధర్మారెడ్డి కోరుతున్నారు. అవసరమైతే సి.బి.ఐ విచారణ కోరుతామని తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588